PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 162 | విజయవాడ, శుక్రవారం 13 జనవరి 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 13 January 2023 | Rs

## రాజ్యాంగమే సర్వోన్నతం

- ఉపరాష్ట్రపతి వ్యాఖ్యలు సరికాదు : ఏచూరి

• లోపలి పేజీలో.. •




## హాకీ ప్రపంచకప్ నేటినుంచే..

- 16 జట్ల మధ్య టైటిల్ పోరు
- స్పెయిన్‌తో తలపడనున్న భారత్

• లోపలి పేజీలో.. •

# 23 వరకు జిఓనెం.1 సస్పెన్షన్

## హైకోర్టు ఆదేశం



**ప్రజాశక్తి - అమరావతి**

రోడ్లపై సభలు, సమావేశాలు, ప్రదర్శనలను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఓనెం1ని ఈ నెల 23వ తేది వరకు హైకోర్టు సస్పెండ్ చేసింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. జిఓ నెం 1ని రద్దు చేయాలని కోరుతూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వాజ్యంపై గురువారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వానికి పలు ప్రశ్నలు సంధించింది. 75 ఏళ్ల స్వతంత్రం భారత దేశ చరిత్రలో ఇటువంటి జిఒ ఎక్కడైనా, ఎప్పుడైనా ఉందా? అని ప్రశ్నించింది. 'స్వాతంత్ర్యానికి ముందు బ్రిటిష్ ప్రభుత్వ కాలంలోనైనా ఈ తరహా జిఓ ఉందా . బ్రిటిష్ వాళ్లు ఆ చట్టాన్ని ఉపయోగించిఉంటే స్వాతంత్ర పోరాటం జరిగేదా?' అని ప్రశ్నించింది. మనం ఏ రోజుల్లో ఉన్నామో అర్థం కావడంలేదని వ్యాఖ్యానించింది. పిటిషనర్ తరపు న్యాయవాది ఈ సందర్భంగా సుప్రీంకోర్టు గత తీర్పులను కోర్టు ముందుంచారు. ప్రభుత్వం జారీ చేసిన జిఓ నిబంధనలకు విరుద్ధంగా ఉందని అభిప్రాయపడిన జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ వక్కలగడ్డ రాధాకష్ణ కృపాసాగర్‌లతో కూడిన డివిజన్ బెంచ్ కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను 20వ తేదికి వాయిదా వేసింది.

**శుభపరిణామం : రామకృష్ణ**

హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు శుభపరిణామమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. కోర్టు ఆదేశాల అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా విజ్ఞతతో వ్యవహరించాలని, జిఓ నెంబర్ 1ని ఉపసంహరించుకోవాలని కోరారు.

**సిపిఎం హర్షం**

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఓ నెంబరు 1ను నిలిపేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడంపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జిఓ నెంబరు1ని ఉపసంహరించుకోవాలని కోరారు.

**ఇకనైనా రాజ్యాంగం అమలుచేయండి : టిడిపి**

రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా రాజారెడ్డి రాజ్యాంగానికి బదులుగా అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగాన్ని అమలు చేయాలని టిడిపి వ్యాఖ్యానించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె. అచ్చెన్నాయుడు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలపక్షాన పోరాడుతున్న ప్రతిపక్షనేతలపై కక్షసాధింపు కోసం ఇచ్చే ఇటువంటి జిఓలు న్యాయస్థానాల్లో నిలబడవని ఇప్పటికైనా గుర్తించాలని సూచించారు.



## ఆ దగ్గు సిరప్‌లను ఉపయోగించొద్దు : డబ్ల్యుహెచ్‌ఒ

• లోపలి పేజీలో.. •



## 30, 31 తేదీల్లో బ్యాంకు ఉద్యోగుల సమ్మె

**ముంబయి :** కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలను వ్యతిరేకిస్తూ బ్యాంకుల ఉద్యోగులు సమ్మె బాట పట్టనున్నారు. ఈ నెల 30, 31 తేదీల్లో రెండు రోజుల పాటు సమ్మె చేపట్టనున్నట్లు వివిధ బ్యాంకు ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బియు) గురువారం ప్రకటించింది. ఈ మేరకు ముంబయిలో జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు యుఎఫ్‌బియులో ప్రధాన సంఘంగా ఉన్న అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం (ఎఐబిఇఎ) ప్రధానకార్యదర్శి సిహెచ్ వెంకటాచలం తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని పదేపదే డిమాండ్ చేస్తున్నా భారత బ్యాంకుల సంఘం (ఐబిఎ) తమ గోడు వినడం లేదని, అందుకనే సమ్మె అనివార్యమైందని ఆయన తెలిపారు. ప్రధానంగా బ్యాంకింగ్ రంగంలో ఐదు రోజుల పని వేళలు అమల్జేయాలని, ఫించను పెంచాలని, అలాగే నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పిఎస్)ను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దీంతో పాటు వేతన సవరణ కోసం ఉద్యోగులు చేస్తున్న డిమాండ్లపై తక్షణ చర్చలు జరపాలని, అన్ని కేడర్లలోనూ ఖాళీలను భర్తీ చేయడంతో పాటు పని ఒత్తిడికి తగినట్టుగా నియామకాల సంఖ్య పెంచాలని కోరారు.

# సంక్రాంతికి 'భరోసా' లేదు!

- మూడవ కిస్తుపై స్పష్టత ఇవ్వని కేంద్రం
- దాంతో కౌల్దార్లకు రాష్ట్ర సర్కారు వాయిదా

**ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి**



రైతుల పండగ సంక్రాంతికి ప్రభుత్వం అందించే రైతు భరోసా సహాయం అందట్లేదు. పెద్ద పండుగ దగ్గర పడుతున్నప్పటికీ అటు కేంద్రం ఇటు రాష్ట్రం రెండు ప్రభుత్వాలూ సంక్రాంతికి అన్నదాతలకు ఇవ్వాల్సిన పెట్టుబడి సాయంపై స్పష్టత ఇవ్వలేదు. ఏడాదికి మూడు విడతల్లో కేంద్రంతో కలుపుకొని 'వైఎస్‌ఆర్ రైతు భరోసా-పిఎం కిసాన్' పథకం కింద రూ.13,500 జమ చేస్తామని రాష్ట్ర సర్కారు చెప్పింది. ప్రతి ఏటా సంక్రాంతికి సొంత భూమి కలిగిన రైతులకు మూడవ కిస్తు రూ.2,000 కేంద్రం జమ చేస్తుందని, కౌలు రైతులకు రాష్ట్రం రూ.2,000 వేస్తుందని పేర్కొంది. పిఎం కిసాన్ మూడవ కిస్తు ఎప్పుడు జమ చేసేదీ కేంద్రం ఇప్పటికైతే వెల్లడించలేదు. దాంతో కౌలు రైతుల మూడవ కిస్తుపై రాష్ట్రం సైతం వెనుకంజ వేసింది. దాంతో సంక్రాంతికి అన్నదాతలకు భరోసా సాయం దక్కట్లేదు. కేంద్రం స్వంత భూమి కలిగిన రైతులకు సంక్రాంతికి మూడవ కిస్తు జమ చేసినా చేయకపోయినా గడచిన మూడేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కౌలు రైతులకు భరోసా జమ చేసింది.

**స్వల్ప సాయమూ వాయిదా**

రైతులు పంటలు పండించడానికి అయ్యే పెట్టుబడులతో, విపత్తు నష్టాలతో, గిట్టుబాటు ధరల నష్టాలతో పోల్చితే ప్రభుత్వాలు చేసే సహాయం నామమాత్రం కాగా దాన్నీ మూడు కిస్తుల్లో ఇస్తున్నాయి. పండక్కి ఇస్తామన్న మూడవ కిస్తు రూ.2 వేలను సైతం జమ చేయకుండా వాయిదా వేయడంపై రైతులు ఆవేదన చెందుతున్నారు. తెలుగునాట సంక్రాంతికి ఉన్న ప్రాధాన్యత తెలిసిందే. అయినా ప్రభుత్వాలు చేస్తామన్న సహాయం వాయిదా వేయడంపై విమర్శలొస్తున్నాయి. ఇస్తామన్న రూ.13,500 ఏడాదిలో మూడు విడతల్లో ఇస్తున్నారు. ఏప్రిల్-జులై, ఆగస్టు- నవంబర్, డిసెంబర్-మార్చి కింద వర్గీకరించారు. తొలి కిస్తులో కేంద్రం రూ.2 వేలు, రాష్ట్రం 5,500 వెరశి 7,500 స్వంత భూమి కలిగిన వారికి ఇస్తున్నారు. రెండవ కిస్తు కేంద్రం 2 వేలు, రాష్ట్రం 2 వేలు జమ చేస్తున్నాయి. రెండవ కిస్తులోనే రాష్ట్రం తన నిధులతో కౌలు రైతులకు, అటవీ హక్కుల చట్టం (ఆర్‌ఒఎఫ్‌ఆర్) రైతులకు, దేవాలయ భూముల కౌలు దారులకు ఒకేసారి రెండు కిస్తులూ కలిపి రూ.11,500 ఇస్తోంది. ఇక మూడవ కిస్తును కేంద్రం 2 వేల వంతున స్వంత భూమి కలిగిన రైతులకు ఇస్తోంది. మూడవ కిస్తులో స్వంత భూమి రైతులకు రాష్ట్రం ఇచ్చేదేమీ లేదు. కేవలం కౌలు, ఆర్‌ఒఎఫ్‌ఆర్, ఎండోమెంట్ రైతులకు రూ.2 వేలు ఇస్తోంది. ఈ మూడవ కిస్తును సంక్రాంతి ముందు ఇస్తామంది.

**ఇచ్చేదే తక్కువ**

సంక్రాంతి ముందు ఇచ్చే మూడవ కిస్తుకు రాష్ట్రం భరించే నిధులు స్వల్పం. లక్షలాదిగా కౌలు రైతులున్నా నిబంధనల వలన స్వల్ప సంఖ్యలోనే కార్డులు పొందుతున్నారు. వారిలోనూ కొంత మందే భరోసాకు ఎంపికవుతున్నారు. ఆర్‌ఒఎఫ్‌ఆర్, ఎండోమెంట్ రైతులూ తక్కువే. సుమారు లక్ష మంది కౌలు రైతులు (సిసిఆర్‌సి), మరో 50-60 వేల మంది వరకు ఆర్‌ఒఎఫ్‌ఆర్, ఎండోమెంట్ రైతులు భరోసాకు అర్హులు. వారికి రూ.2 వేల చొప్పున జమ చేస్తే సర్కారు పెట్టుకోవాల్సింది రూ.30-40 కోట్లు మాత్రమే. కేంద్రం మొత్తానికే కౌల్దార్లకు పిఎం కిసాన్ సహాయం ఇవ్వట్లేదు. స్వంత భూమి దారులకే ఇస్తోంది. ఎలాగూ స్వంత భూమి సాగుదారులకు కేంద్రం సంక్రాంతికి సహాయం జమ చేయట్లేదు కనుక రాష్ట్ర సర్కారు కూడా తాను కౌలు దారులకు ఇవ్వాల్సిన సహాయాన్ని వాయిదా వేసుకున్నట్లు చెబుతున్నారు.



## శరద్ యాదవ్ కన్నుమూత

**పాట్నా:** మాజీ కేంద్ర మంత్రి శరద్ యాదవ్ (75) గురువారం రాత్రి కన్ను మూశారు. వయోభారంతో బాధ పడుతున్న శరద్ యాదవ్‌ను చికిత్స కోసం ఆయన కుటుంబ సభ్యులు గుర్‌గ్రామ్‌లోని ఫోర్టిస్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తు న్నారు. ఆయన పరిస్థితి విషమించడంతో మరణించి నట్లు కూతురు సుభాషిణి శరద్ యాదవ్ ట్విట్టర్ వేదికగా తెలిపారు. జనతాదళ్ యునైటెడ్ వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఉన్న శరద్ యాదవ్ ఏడుసార్లు లోక్‌సభకు, మూడుసార్లు రాజ్య సభకు ఎన్నికయ్యారు. 2018లో లోక్ తాంత్రిక్ జనతాదళ్ పార్టీని స్థాపించారు. 1947 జూలై 1న మధ్యప్రదేశ్ రాష్ట్రంలో శరద్ యాదవ్ జన్మించారు. బీహార్‌లో ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తదితరులతో కలిసి పని చేసిన అనుభవం ఉంది. 1989కి ముందు విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ స్థాపించిన జనతాదళ్ పార్టీలో కీలకంగా వ్యవహరించారు.

# గౌరవం తగ్గకుండా పొత్తు

- ఒంటరిగానైనా పోటీ
- నియంతను కలిసికట్టుగానే ఎదుర్కోవాలి
- 'యువశక్తి' సభలో జనసేన అధినేత పవన్ కల్యాణ్



సభలో మాట్లాడుతున్న పవన్ కళ్యాణ్

**ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి**

'రాబోయే ఎన్నికల్లో గౌరవప్రదంగా పొత్తులకు ప్రయత్నిస్తాం. గౌరవం తగ్గకుండా పొత్తులు కుదిరితే అంగీకరిస్తాం. లేని పక్షంలో ఒంటరిగానైనా బరిలోకి దిగుతాం' అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం తాళ్లవలసలో గురువారం నిర్వహించిన 'యువశక్తి' బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ పొత్తుల విషయమై స్పందించారు. '2024 ఎన్నికలు చాలా కీలకమైనవి. ప్రభుత్వ వ్యతిరేక ఓటును ఏమాత్రం చీలనీయకూడదు.అందరినీ ఒకరు హింసిస్తుంటే, అందరూ కలిసి వెళ్లాలి. నియంతను కలిసికట్టుగానే ఎదుర్కోవాలి' అని చెప్పారు. 'ఒంటరిగా పోటీ చేసి గెలిచే పరిస్థితి ఉంటే ఎవరితోనూ పొత్తు పెట్టుకోం. కానీ, ఆ పరిస్థితి ఉందా? ఒంటరిగా పోటీ చేసి గెలవగలమా? ఆ భరోసా ఇవ్వగలరా?' అని కార్యకర్తల నుద్దేశించి ఆయన ప్రశ్నించారు. తన సభలకు వచ్చి చప్పట్లు కొట్టిన అనేకమంది ఎన్నికల సమయంలో సామాజిక తరగతి, బంధుత్వం చూసుకుంటున్నారని అన్నారు. గత ఎన్నికలలో 50 సీట్లలో వైసిపి గెలుపు కేవలం సాంకేతికపరమైనదేనని చెప్పారు. అందుకే ఓట్లు చీలకూడదని చెప్తున్నానని అన్నారు. అధికారం ఇస్తే సేవకుడిగా పనిచేస్తానని చెప్పారు. తుది శ్వాస వరకు రాజకీయాల్లోనే ఉంటానన్నారు. చట్ట సభలకు పది మంది జనసేన ఎమ్మెల్యేలను పంపించి ఉంటే పోరాటం మరోలా ఉండేదని చెప్పారు. జనసేన అధికారంలోకి వస్తే యువత కోసం యూత్ డెవలప్‌మెంట్ అథారిటీ బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పారు. జనసేన వచ్చినా, మిశ్రమ ప్రభుత్వం వచ్చినా పంచాయతీల నిధులు దారి మళ్లకుండా వాటి అభివృద్ధికే కేటాయిస్తామన్నారు. కోస్టల్ కారిడార్‌లో అర్హతలతో సంబంధం లేకుండా ఉద్యోగావకాశాలు కల్పిస్తామని హామీనిచ్చారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మూడు ముక్కల సిఎం అని అభివర్ణించారు. ప్రభుత్వం కేసులు పెట్టినా భయపడొద్దని, చిన్నపాటి కష్టం పడకపోతే బానిసలుగానే బతకాల్సి వస్తుందని చెప్పారు. పోలీసు ఉద్యోగాలకు తెలంగాణ మాదిరిగా ఐదేళ్లు వయోపరిమితి పెంచాలని డిమాండ్ చేశారు.ఇటీవల మరణించిన జనసేన కార్యకర్తల కుటుంబాలకు చెందిన ముగ్గురికి రూ.5 లక్షలు చొప్పున ఆర్థిక సాయం అందించారు. అంధుల ప్రపంచకప్ క్రికెట్ కప్ గెలిచిన జట్టులో ఉన్న రాష్ట్రానికి చెందిన నలుగురికి రూ.50 వేలు సాయ మందించారు. ఎచ్చెర్ల ఇంజినీరింగ్ మిగతా 5లో

# కొత్త తరహా ఉత్పత్తులు రావాలి

- గ్లోబల్ ఇన్వెస్టర్ల సదస్సు సమీక్షలో సిఎం

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**



రాష్ట్రానికి కొత్త తరహా ఉత్పత్తులు, ఇంధనాల తయారీ యూనిట్లు రావాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. విశాఖపట్నంలో మార్చి మూడు, నాలుగు తేదీల్లో జరిగే గ్లోబల్ ఇన్వెస్టర్ల సదస్సు ఏర్పాట్లపై క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆ సదస్సును జయప్రదం చేయడానికి అవసరమైన ఏర్పాట్లను ప్రతిష్టాత్మకంగా చేయాలని చెప్పారు. ఈ సదస్సుకు హాజరయే పెట్టుబడి దారుల నుండి కేవలం హామీలు కాకుండా వాస్తవిక పెట్టుబడులు వచ్చేలా చూడాలని చెప్పారు. 2014 నుండి 2019 మధ్య కాలంలో రూ.18.87 లక్షల కోట్లకు ఎంఓయు చేసుకుంటే వాస్తవానికి ఆ మధ్యకాలంలో ఏడాదికి రూ.11,994 కోట్లు మాత్రమే పెట్టుబడులుగా వచ్చాయని తెలిపారు. 2019-2022 మధ్య పెట్టుబడుల్లో ఏడాదికి రూ.15,693 కోట్లు వచ్చాయని తెలిపారు. 2019 నుండి ఇప్పటి వరకూ ఎస్‌ఐపిబి రూ.1,81,821 కోట్ల పెట్టుబడులు రాగా అవన్నీ వేర్వేరు దశల్లో ఉన్నాయని వివరించారు. వీటి ద్వారా 1,40,903 మందికి ఉద్యోగాలు వస్తాయని వివరించారు

**ప్రతిష్టాత్మకంగా జి-20 సన్నాహక సదస్సు**

మార్చి 28-29 తేదీలలో విశాఖలో జరగనున్న జి-20 సన్నాహక సదస్సుకు ప్రతిష్టాత్మ కంగా ఏర్పాట్లు చేయాలన్నారు. విశాఖ నగరాన్ని అందంగా తీర్చిదిద్దాలని, అవసర మైన రోడ్ల సుందరీకరణ చేపట్టాలని చెప్పారు. ప్రధాన జంక్షన్లు, బీచ్‌రోడ్డులో సుందరీకరణ పనులు చేపట్టాలని తెలిపారు. అన్ని రోజుల్లోనూ రోడ్లు అలాగే ఉండేలా చూడాలని తెలిపారు. అతిధ్యం, రవాణా తదితర ఏర్పాట్లలో ఎలాంటి సమస్యలూ లేకుండా చూసుకోవాలని తెలిపారు ఏర్పాట్లకు సంబంధించిన కమిటీలు ఏర్పాటు చేయాలని సిఎం తెలిపారు. ఈ సదస్సుకు ఒక్కొక్క జి 20 సభ్య దేశం నుండి ఆరుగురు హాజరవుతారని, అంతర్జాతీయ సంస్థల నుండి నలుగురు, కేంద్ర ప్రభుత్వం నుండి 100 మంది ప్రతినిధులు వస్తారని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. ప్రతినిధులకు సౌలభ్యంగా ఉండేందుకు మొబైల్‌యాప్‌ను రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. పర్యాటక ప్రాంతాల వద్ద ఆహ్లాదకరకర పరిస్థితులు ఉండేలా చూడాలన్నారు. ప్రతినిధుల భద్రత విషయంలోనూ కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు.




## ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకు సమరయాత్ర

- పోస్టర్ ఆవిష్కరించిన నేతలు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్రానికి ప్రత్యేకహోదా, విభజన హామీల సాధన కోసం విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమరయాత్రను జయప్రదం చేయాలని పలు రాజకీయ పార్టీల నాయకులు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు నిర్వహించనున్న యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్రమోడీ ప్రభుత్వం ఎనిమిదేళ్లుగా రాష్ట్రానికి పదేపదే అన్యాయం చేస్తోందని విమర్శించారు. రాష్ట్ర విభజన హామీల్లో ఒక్క దానిని కూడా సంపూర్ణంగా అమలు చేయలేదన్నారు. కేంద్రం నిర్లక్ష్య వైఖరికి నిరసనగా 26 జిల్లాల్లో సమరయాత్ర జరగనుందని తెలిపారు. రాజకీయ, ప్రజాసంఘాలు వ్యతిరేకించిన జిఓకు మద్దతుగా వైస్ ఛాన్సలర్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ ప్రత్యేక హోదా, విభజన మిగతా 5లో

## వాహన పన్ను పెంపును ఉపసంహరించుకోవాలి

- సిపిఎం, లారీఓనర్స్ అసోసియేషన్ డిమాండ్

## ఒపిఎస్ అమల్జేయాలి

- రైల్వే యూనియన్ల ఆందోళన

## నకిలీ విత్తన డీలర్లపై పిడి యాక్ట్

- రైతుల డిమాండ్
- క్రోసూరు ఎడిఎ కార్యాలయానికి తాళం

• లోపలి పేజీలో.. •

# ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్‌కు శాశ్వత చట్టం

## కెవిపిఎస్ రాష్ట్ర సదస్సు డిమాండ్

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)**

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టాన్ని శాశ్వతంగా అమలు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యాన విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గురువారం జరిగిన రాష్ట్ర స్థాయి సదస్సు తీర్మానించింది. ముఖ్య అతిథిగా హాజరైన సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ వ్యవస్థాపకులు మల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ.. దళిత, గిరిజనుల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా 2012లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ప్రత్యేకంగా మూడు రోజులపాటు చర్చించి ఏకగ్రీవంగా రూపొందించిన ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టం పదేళ్ల కాలపరిమితితో నాటి రాష్ట్ర గవర్నర్ ఆమోదంతో రూపుదాల్చింద న్నారు. రాష్ట్ర విభజన తరువాత ప్రభుత్వాల విధానాల్లో వచ్చిన ప్రాధాన్యతల్లో ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ చట్టం అనుకున్న లక్ష్యాలను సాధించలేకపోయిందని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టిల స్థితిగతులను మార్చేందుకు అనువైన కార్యక్రమాలు, పథకాల రూపకల్పన, నిధులు కేటాయింపుల్లో ప్రభుత్వాలు చట్టపరంగా వ్యవహరించలేదన్నారు. తక్షణమే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు జరిపి పాత చట్టం స్థానంలో సరికొత్త శాశ్వత చట్టాన్ని రూపొందించి పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మరో ముఖ్య అతిథి దళిత్ శోషణ్ ముక్తిమంచ్ జాతీయ కార్యదర్శి వి.శ్రీనివాసరావు




సదస్సులో మాట్లాడుతున్న లక్ష్మయ్య, వేదికపై వి శ్రీనివాసరావు తదితరులు

మాట్లాడుతూ. ఈ నెల 23తో ముగిసే ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టానికి వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తేవడంతో పాటు సవరణలు కూడా చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. సబ్‌ప్లాన్ నిధులను సాధారణ అభివృద్ధికి వినియోగించడం సరికాదని అన్నారు. దేశమంతా స్మార్ట్ సిటీ, స్మార్ట్ హోమ్‌ల దిశగా పయనిస్తున్న తరుణంలో దళిత, గిరిజనులు ఇప్పటికీ వెనుకబడే ఉన్నారని, పరిస్థితి ఇలాగే కొనసాగితే వారి మనుగడ ప్రశ్నార్థకమవుతుందని అన్నారు. దళిత బంధు అని చెప్పుకునే సిఎం జగన్ వెంటనే ఆర్డినెన్స్ తెచ్చి దళితులపై ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సదస్సులో కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జెవి.ప్రభాకర్‌రావు, ఆర్‌పిఐ జాతీయ ఉపాధ్యక్షులు బొడ్డు కల్యాణ్‌రావు, దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు, గిరిజన ఉద్యోగుల సంఘం విశాఖ జిల్లా అధ్యక్షులు కోరాబు సత్యనారాయణ, మిగతా 5లో



## సిఎంను కలిసిన సోమేష్‌కుమార్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తెలంగాణా నుంచి రిలీవ్ అయ్యి ఆంధ్రప్రదేశ్‌లో రిపోర్టు చేసేందుకు వచ్చిన మాజీ సిఎస్ సోమేష్‌కుమార్ గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకుముందు విజయవాడలోని సిఎస్ క్యాంపు కార్యాలయంలో సిఎస్ జవహర్‌రెడ్డిని కలిసి రిపోర్టు చేశారు. అనంతరం ఆయన స్పందిస్తూ తాను ఏమి చేయాలనుకునేది తరువాత చెబుతానని అన్నారు. ముందుగా కోర్టు ఉత్తర్వులమేరకు రిపోర్టు చేయడానికి వచ్చానని పేర్కొన్నారు. ప్రస్తుతం విఆర్‌ఎస్ తీసుకోవాలనే ఆలోచన లేదని చెప్పారు. ఏ బాధ్యత అప్పగించినా చేసేందుకు సిద్ధంగా ఉన్నానని వివరించారు.

## సిపిఎం అభిమాని ఎస్.అనంత్ మృతి

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో



ప్రజాశక్తి బుక్‌హౌస్ సంపాదకులు ఎస్. వెంకట్రావు సోదరుడు, సిపిఎం సానుభూతిపరుడు ఎస్. అనంత్ మృతి చెందారు. ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్న ఆయన గురువారం రాత్రి విద్యుత్‌షాక్‌కు గురై పడిపోయారు. దీనిని గమనించిన స్థానికులు హుటాహుటిన పక్కనే ఉన్న మణిపాల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే, మార్గమధ్యలోనే ఆయన మరణించారు.

సిపిఎం తాడేపల్లి రూరల్ కార్యదర్శి డి వెంకటరెడ్డితో పాటు పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు అనంత్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. శుక్రవారం సాయంత్రం నాలుగుగంటలకు అంత్యక్రియలను నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

## గణనీయమైన ప్రగతి

- ఆర్‌టిసి ఎమ్‌డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉద్యోగులు అంకితభావంతో పనిచేయడంతో 2022లో ఆర్‌టిసి వాణిజ్యపరంగా గణనీయమైన ప్రగతి సాధించిందని ఎపిఎస్‌ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు తెలిపారు. విజయవాడలోని ఆర్‌టిసి భవన్‌లో ఉద్యోగులు వ్యవహరించాల్సిన విధివిధానాలకు సంబంధించి కరపత్రాన్ని గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు తీసుకెళ్లడమే ఆర్‌టిసి ఉద్యోగులకు ప్రథమకర్తవ్యంగా వుండాలని అన్నారు. ఉద్యోగుల్లో క్రమశిక్షణ, నైపుణ్యత, అంకితభావం ఉన్నప్పుడే సంస్థ మంచి ఫలితాలను రాబడుతుందని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం కార్గోలో ఆర్జించిన రూ.122 కోట్ల ఆదాయాన్ని ఈ ఏడాది మూడు నెలలు వుండగానే రాబట్టామన్నారు.

# వాహన పన్ను పెంపు ఉపసంహరించుకోవాలి

## సిపిఎం, ఎపి లారీ ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సరకు, ప్రయాణికుల రవాణా వాహనాలపై పెంచిన 30 శాతం త్రైమాసిక పన్నును తక్షణం ఉపసంహరించుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల డీజిల్ ధరలు పెరగడం, కరోనాతో కోలుకోలేని దెబ్బతినడం వల్ల రవాణా రంగం కుదేలైంది.

ప్రతి సంవత్సరం టోల్‌గేట్ల రేట్లు 15 శాతం పెంచుతున్నారు. కిస్తీలు కట్టలేక, కిరాయిలు రాక, వాహనాల మెయింటెనెన్స్ పెరిగి లారీ ఓనర్లు దివాళా తీసే స్థితిలో ఉన్నారు. జిఒ నెంబరు 21తో రాష్ట్రంలో చలానాలు, జరిమానాలు మూడు రెట్లు పెరిగాయి. గ్రీన్‌ట్యాక్స్ పేరుతో గతేడాది పెంచిన పన్ను భారానికి వ్యతిరేకంగా యజమానులు ఆందోళన చేస్తూనే ఉన్నారు. గ్రీన్‌ట్యాక్స్‌ను తగ్గించకపోగా ఇప్పుడు త్రైమాసిక పన్నును 30శాతం పెంచడం మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లే. దీనివల్ల పరోక్షంగా రూ.200 కోట్ల భారం ప్రజలు/వినియోగదారులపై పడుతుంది. ట్రావెల్స్ బస్సులకు సీటుకు రూ.250 పెంచడమంటే ప్రయాణికులపై భారం వేయడమే. పొరుగు రాష్ట్రాలు కోవిడ్ సమయంలో త్రైమాసిక పన్నుల్లో రాయితీలిస్తే మన రాష్ట్రంలో తగ్గించకపోగా పెంచడం గర్హనీయం. గ్రీన్ ట్యాక్స్ తగ్గించాలని, త్రైమాసిక పన్ను పెంపుదల ప్రతిపాదనలపై లారీ యజమానుల సంఘం చేస్తున్న ఆందోళనలకు సిపిఎం సంపూర్ణ మద్దతునిస్తుంది. రవాణా శాఖ ఈ భారాలకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నప్పటి నుంచి ముఖ్యమంత్రికి, మంత్రులకు, అధికారులకు ఎన్ని విజ్ఞప్తులు చేసినా ఫలితం లేదు. రవాణా రంగంపై ఆధారపడి లక్షలాది మంది కార్మికులు జీవిస్తున్నారు. ఈ రంగాన్ని కాపాడుకోవడం రాష్ట్ర శ్రేయస్సుకు అవసరం. రవాణా వాహనాలపై పన్నులు పెంచడమంటే అంతిమంగా ప్రజలపై భారం వేయడమే. డీజిల్, పెట్రోలు ధరలు పెరగడంతో నిత్యావసర సరుకుల ధరలు పెరిగి, ఇప్పటికే ప్రజలు సతమతమవుతున్నారు.

ఈ ట్యాక్స్ పెంపు మరింత భారం కానుంది. రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు ఆసరా, తోడు అంటూ మరోవైపు పన్నులు, ధరలు పెంచడం ప్రజలను దగా చేయడమే. కాబట్టి తక్షణం త్రైమాసిక రవాణా పన్ను పెంపు నోటిఫికేషన్‌ను ఉపసంహరించాలని' సిపిఎం డిమాండ్ చేసింది.

**త్రైమాసిక రోడ్‌ట్యాక్స్ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి : ఎపి లారీఓనర్స్ అసోసియేషన్**

రాష్ట్ర ప్రభుత్వం వాహన యజమానులపై పెనుభారం పడేలా పెంచిన త్రైమాసిక రోడ్‌ట్యాక్స్ ఉత్తర్వులను తక్షణం ఉపసంహరించుకోవాలని ఎపి లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఇప్పటికే పొరుగు రాష్ట్రాలకంటే ఎక్కువగా డీజిల్, పెట్రోల్ ధరలతోపాటు గ్రీన్‌ట్యాక్స్‌ను చెల్లిస్తున్నామని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. పొరుగు రాష్ట్రాల్లో గ్రీన్‌ట్యాక్స్ రూ.200 వుంటే, రాష్ట్రంలో రూ.20 వేలు వసూలు చేయడం సరైందికాదని పేర్కొన్నారు. ఇప్పుడు తాజాగా 30 శాతం రోడ్ ట్యాక్స్‌ను పెంచడం అంటే రవాణారంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేయడమేనని తెలిపారు. తక్షణం రోడ్‌ట్యాక్స్ పెంపుదల ఉత్తర్వులను రద్దుచేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# పెద్ద పండుగకు చలో చలో...

- పంతంగి టోల్‌గేట్ వద్ద వాహనాల బారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంక్రాంతి పండుగకు హైదరాబాద్ సిటీ ఖాళీ అయింది. పెద్ద పండుగకు సొంతూళ్లకు వెళ్లేందుకు బతుకుజీవులు పయనమయ్యారు. విద్యాసంస్థలకు కూడా నేటి నుంచి సెలవులు ఇవ్వడంతో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడాయి. రద్దీని దృష్టిలో పెట్టుకుని తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, గుంటూరు, ఒంగోలు, తిరుపతి, నెల్లూరు, విశాఖ, ఏలూరు, రాజమండ్రి పట్టణాలకు టిఎస్‌ఆర్టిసి ప్రత్యేక బస్సుసర్వీసులను నడుపుతోంది. ఎపిలోని ఆయా ప్రాంతాలకు ఎపిఎస్ ఆర్‌టిసి కూడా స్పెషల్ సర్వీసులను ప్రారంభించింది. విజయవాడ, మచిలీపట్నం, విశాఖకు దక్షిణ మధ్య రైల్వే స్పెషల్ రైళ్లను నడుపుతోంది. గురువారం హైదరాబాద్ నుంచి బయల్దేరిన రైళ్లు, ఆర్టిసి బస్సులు, ప్రైవేట్ ట్రావెల్స్ అన్నీ నిండిపోయాయి. మహాత్మాగాంధీ బస్టాండ్, ఇసిఐఎల్, కూకట్‌పల్లి, ఎల్‌బినగర్ బస్టాండ్ల వద్ద పెద్ద సంఖ్యలో ప్రజలు బస్సుల కోసం వేచిచూడాల్సి వచ్చింది. స్పెషల్ బస్సులూ నిండిపోవడంతో ప్రయాణికుల రద్దీని బట్టి అప్పటికప్పుడు ఎంజిబిఎస్ నుంచి ఆయా ప్రాంతాలకు మెట్రో సర్వీసులను నడుపుతున్నారు. పండుగ స్పెషల్ బస్సుల్లోనూ టిఎస్‌ఆర్‌టిసి సాధారణ చార్జీలే అమలుచేస్తోంది. ఈ నేపథ్యంలో జాతీయ రహదారులు రద్దీగా మారాయి. హైదరాబాద్-విజయవాడ 65వ నెంబర్ జాతీయ రహదారిపై పంతంగి టోల్ గేట్ వద్ద రద్దీ భారీగా పెరిగింది. కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌ను పోలీసులు ఎప్పటికప్పుడూ క్లియర్ చేస్తున్నారు.



## టోల్‌గేట్ల వద్ద రద్దీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట (ఎన్‌టిఆర్ జిల్లా)

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఉద్యోగులకు మూడు రోజులు సెలవులు రావడంతోపాటు పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో పట్టణం వాసులు పల్లెబాట పడుతున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ అధికమైంది. తెలంగాణ ప్రాంతం నుండి ఆంధ్రాకు వచ్చే ప్రయాణికుల వాహనాలతో ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం చిల్లకల్లులోని జిఎంఆర్ టోల్‌గేట్, కంచికచర్ల మండలం కీసర టోల్‌గేట్ వద్ద వాహనాలు బారులుతీరాయి. సంవత్సరంలో వచ్చే మొదటి పండుగ సంక్రాంతి కావడంతో హైదరాబాద్ పట్టణంలో నివసించే వారు తమ స్వగ్రామాలకు వస్తున్నారు. దీంతో జాతీయ రహదారిపై విపరీతంగా రద్దీ పెరిగింది. కార్లు, ఇతర వాహనాలతో కిటకిటలాడుతోంది. చిల్లకల్లు టోల్ గేట్ వద్ద వాహనాల రద్దీతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసిపోయింది.

## వివేకానందకు జగన్, చంద్రబాబు నివాళి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా స్వామి వివేకానందకు సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు గురువారం నివాళులర్పించారు. తన క్యాంపు కార్యాలయంలో వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి, సిఎం నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి చంద్రబాబునాయుడు గురువారం నివాళులర్పించారు.

# ఉపాధ్యాయుల సర్దుబాటు గందరగోళం

- ప్రక్రియ వాయిదా వేయాలి
- యుటిఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయుల పని సర్దుబాటు గందరగోళంగా ఉందని, ఈ ప్రక్రియను వాయిదా వేయాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ కోర్టు పరిధిలో ఉన్నందున తాత్కాలిక ప్రాతిపదికన నియామకం చేయడానికి అనుసరించే ప్రక్రియలో పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులు భిన్నంగా ఉన్నాయని పేర్కొంది. దీనివల్ల గందరగోళం ఏర్పడుతుందని అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్, ఆ సంఘం ఆఫీస్ బేరర్ల సమావేశంలో గురువారం చెప్పారు. కోర్టు పరిధిలో ఉన్నందున తాత్కాలిక నియామకాలు చేపడతామని కమిషనర్, సర్దుబాటు చేసిన వారికి జనవరి 20 నుంచి కొత్త ప్రదేశంలో జీతం ఇస్తామని ముఖ్యకార్యదర్శి ఉత్తర్వులు ఇచ్చారని పేర్కొన్నారు. ప్రమోషన్ల వారికి ఇస్తామన్న నగదుకు ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చిందా అని ప్రశ్నించారు. నూతన పాఠశాలలో జీతం అంటే కేడర్ స్ట్రెంత్ సర్దుబాటు, ఫైనాన్స్ వారి అనుమతి ఏమిటి? అనే దానిపై అస్పష్టత ఉందన్నారు. సీనియార్టీ, ప్రదేశాల జాబితాపై కూడా స్పష్టత లేదని పేర్కొన్నారు. ఇంత అస్పష్టతగా ఉన్న ఉత్తర్వుల కారణంగా కౌన్సిలింగ్‌లను తాత్కాలికంగా వాయిదా వేసి సంక్రాంతి సెలవులు అనంతరం సంఘాలతో చర్చించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ప్రధానోపాధ్యాయులకు డిడిఓ పవర్స్ ఇవ్వాలని, పాత బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గౌరవాధ్యక్షులు కె శ్రీనివాసరావు, సహాధ్యక్షులు కె సురేష్ కుమార్, ఎఎన్ కుసుమకుమారి, కోశాధికారి బి గోపీమూర్తి, కార్యదర్శులు బి లక్ష్మిరాజా, వి మహేష్, ఎన్ నాగమణి, టి రఘుపతిరెడ్డి, ఎస్‌పి మనోహర్ కుమార్, ఎన్ అరుణకుమారి, వి కోటేశ్వరప్ప, ఆడిట్ కమిటీ కన్వీనర్ టిఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు, ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

**కొత్త సమస్యలు తెచ్చే విధానం:ఎపిటిఎఫ్**

సర్దుబాటుపై విద్యాశాఖ ఉత్తర్వులు కొత్త సమస్యలు తెచ్చేవిధంగా ఉందని ఎపిటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి హృదయరాజు, ఎస్ చిరంజీవి పేర్కొన్నారు. ఈ అంశంపై పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ (సర్వీసెస్) మువ్వా రామలింగంను కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం చేపడుతున్న ఎస్‌జిటిల సర్దుబాటు ప్రక్రియ గతంలో ఎప్పుడూ లేదని తెలిపారు. దీనిని తగిన విధంగా పరిష్కారం చేయాలని కోరారు. సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత పేరుతో ఎటువంటి నియమ నిబంధనలు పాటించకుండా చేస్తున్న పని సర్దుబాటును తక్షణం రద్దు చేయాలని ఎస్టియు అధ్యక్షప్రధాన కార్యదర్శులు సాయి శ్రీనివాస్, హెచ్ తిమ్మన్న ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో చేసిన ఉపాధ్యాయుల పదోన్నతులకు ప్రక్రియను పూర్తిచేయాలని డిమాండ్ చేశారు.

# చీకటి జివోపై యూనివర్సిటీలో సదస్సా?

- ఖండించిన విద్యార్థి సంఘాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రప్రభుత్వం ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాస్తూ తీసుకొచ్చిన జిఓ 1పై ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సదస్సు నిర్వహించడాన్ని విద్యార్థి సంఘాలు ఉమ్మడిగా ఖండించాయి. ఈ మేరకు ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్, పిడిఎస్‌యు, ఎఐఎస్‌ఎ, పిడిఎస్‌ఒ గురువారం సంయుక్తంగా ప్రకటన విడుదల చేశాయి.

ఈ జిఒకు మద్దతు తెలపడం రాజ్యాంగాన్ని విస్మరించడమే అవుతుందని ఆయా సంఘాల రాష్ట్ర నాయకులు పేర్కొన్నారు. ప్రజాస్వామ్యానికి, అభ్యుదయానికి, సైద్ధాంతిక చర్చలకు నిలయాలుగా మారాల్సిన యూనివర్సిటీలో చీకటి చట్టానికి మద్దతుగా కార్యక్రమాన్ని నిర్వహించడం దారుణమని విమర్శించారు. దీనిని నిర్వహించిన అధికారులు, మద్దతుగా నిలిచిన ప్రొఫెసర్లు జిఓను క్షుణ్ణంగా చదవాలని సూచించారు. మేధోవంతమైన చర్చలకు, ఆలోచనలకు నిలయాలుగా ఉండకుండా రాజకీయ పార్టీకి అనుకూలంగా వ్యవహరించి యూనివర్సిటీల ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నాయని తెలిపారు. గతంలోనూ ఆగస్టు 15న సందర్భంగా వైసిపి ప్రచార పాటలతో విద్యార్థులతో నృత్యాలు వేయించడం, సిఎం జన్మదినానికి కేకులు కట్ చేయడం వంటివి నిర్వహించి విజ్ఞాన కేంద్రాన్ని వైసిపి కార్యక్రమాలకు నిలయంగా మార్చడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. ఈ విధమైన కార్యక్రమాలు కాకుండా విజ్ఞాన వంతమైన కార్యక్రమాలు యూనివర్సిటీలో నిర్వహించి ప్రమాణాలు కాపాడాలని కోరారు.

## లక్ష్యాలు చెప్పండి అవుట్‌కమ్ బడ్జెట్‌పై వివరాల సేకరణ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

అవుట్‌కమ్ బడ్జెట్‌కోసం రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. దీనికోసం ప్రణాళికశాఖ అధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని శాఖలకు అవుట్‌కమ్ బడ్జెట్ రూపకల్పనపై మార్గదర్శకాలు కూడా జారీ చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో చేసిన అభివృద్ధి, వచ్చే 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేయాల్సిన అభివృద్ధి లక్ష్యాలపై వివరాలు సేకరించాలని నిర్ణయించారు. ప్రధానంగా కొత్త ఆర్థిక సంవత్సరంలో వివిధ శాఖల లక్ష్యాలను వివరించాలని ప్రణాళిక శాఖ కోరింది. నవరత్నాలు, అందులో చేపట్టిన కార్యక్రమాలను పూర్తిగా సాధించేందుకు చేస్తున్న వ్యూహాలను వివరించాలని పేర్కొంది.

ఇప్పటికే అమలు చేస్తున్న కొత్త పథకాలను వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఎలా ముందుకు తీసుకువెళ్లాలనుకుంటున్నది కూడా స్పష్టం చేయాలని నిర్దేశించింది. కొత్త పథకాలు ప్రకటించాలనుకుంటే వాటి వివరాలను తెలియచేయాలని కోరింది. బడ్జెట్‌లో కోరుతున్న నిధులు, వాటిపై సవరణ అంచనాలను చెప్పాలని కూడా సూచించింది. పనితీరు సూచికలను కూడా బడ్జెట్ సమావేశాలకు రెండు రోజులు ముందుగా సంబంధిత శాఖల వెబ్‌సైట్లలో పొందుపరచాలని పేర్కొంది.

## బాబు కోసమే పవన్ రాజకీయాలు

- మాజీ మంత్రి పేర్ని నాని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ సొంత రాజకీయాలు కాకుండా కేవలం చంద్రబాబునాయుడి కోసమే రాజకీయాలు చేస్తున్నారని మాజీ మంత్రి పేర్ని నాని విమర్శించారు. గురువారం రాత్రి తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. శ్రీకాకుళం సభలో పవన్ కల్యాణ్ ప్రసంగం మొత్తం ఆత్మస్తుతి, పరనింద అన్న రీతిలో సినిమా డైలాగ్స్‌లా సాగిందని విమర్శించారు. తెలుగుదేశం, వామపక్షాలు, బిజెపితో అంటకాగి మళ్లీ ఇప్పుడు టిడిపి అంటున్నారని అన్నారు. పవన్‌కల్యాణ్ వేదిక మీద బిసిలకు ఎందుకు చోటు కల్పించలేదో చెప్పాలని అన్నారు. కాపులను మోసం చేశారని మండిపడ్డారు. జగన్ ప్రభుత్వం నియంత ప్రభుత్వం అయితే ఎలా మీటింగ్ పెట్టుకోగలిగారో చెప్పాలన్నారు. బాలకృష్ణ సినిమాకు టికెట్ రేట్ పెంచుకునేందుకు అవకాశం కల్పించలేదా అని ప్రశ్నించారు. శ్రీకాకుళంలో ఫిషింగ్ హార్బర్ ఎందుకు కట్టించలేదని చంద్రబాబునాయుడిని ఎందుకు నిలదీయలేకపోతున్నారని అన్నారు. ప్రజల గురించి మాట్లాడటం మాని అంబటి రాంబాబు, గుడివాడ అమర్నాథ్‌లపై ఎందుకు మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. మహిళల గురించి కూడా సభ్యతతో మాట్లాడాలని అన్నారు.

## ఐక్య పోరాటాలతో 'ఉక్కు' పరిరక్షణ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ఐక్య పోరాటాలతో విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకుంటామని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారానికి 700వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్ అండ్ కన్‌స్ట్రక్షన్ విభాగం కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుకు అప్పగించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి ప్రతి ఒక్కరూ ఎదురుతిరగాలన్నారు. నేటికీ ఎనిమిది వేల మంది ఉక్కు నిర్వాసితులు ఆర్ కార్డు కలిగి ఉండి శాశ్వత ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్కు ఉద్యమం దేశ వ్యాప్తమైందని, ఈ నెల 30న ఉక్కు నగరంలో జరిగే ఉక్కు ప్రజాగర్జన సభను జయప్రదం చేయాలని కోరారు.

## రూ.100 కోట్ల వ్యాపారమే లక్ష్యం

- ఆప్కో 90వ స్టాల్ ప్రారంభంలో మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆప్కో ద్వారా ఈ ఏడాది రూ.100 కోట్ల వ్యాపారం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. వెలగపూడి సచివాలయంలో ఉద్యోగుల కోసం ఏర్పాటుచేసిన ఆప్కో 90వ స్టాల్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి కానుకగా ఈ స్టాల్‌ను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 900కు పైగా ఉన్న చేనేత కార్మిక సంఘాలను ప్రోత్సహించే విధంగా పలు రకాలుగా చేయూతనిచ్చే కార్యక్రమాలను సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. నేతన నేస్తం పథకం కింద ఇప్పటికే రూ.775 కోట్ల మేర ఆర్థిక సహాయాన్ని చేనేత కార్మికులకు అందజేసినట్లు తెలిపారు. చేనేత కార్మికులకు పింఛను అర్హత వయసును 50 సంవత్సరాలకు తగ్గించామని, రూ.1150 కోట్లను అందించామని పేర్కొన్నారు. విశాఖలో జరిగే గ్లోబల్ సమ్మిట్లో చేనేత ఉత్పత్తులను ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. షోరూములో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువులోని లేపాక్షి, ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలను మంత్రి సందర్శించారు.

## హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్లే వాడండి : సిఎస్

**అమరావతి బ్యూరో :** రాష్ట్రంలో ప్రతి వాహనానికీ హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్లనే వాడాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి ఆదేశించారు. గురువారం అమరావతిలోని సచివాలయంలో రోడ్ సేఫ్టీఫండ్ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్లపై ప్రమాదాలను తగ్గించేందుకు చర్యలను తీసుకోవాలన్నారు.

**సచివాలయంలో సంక్రాంతి సంబరాలు**

సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన ఆంధ్రప్రదేశ్ సచివాలయ ఆవరణలో సంక్రాంతి సంబరాలు గురువారం జరిగాయి. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ పాల్గొని ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు.

# నకిలీ విత్తన డీలర్లపై పిడి యాక్ట్

- రైతుల డిమాండ్
- క్రోసూరు ఎడిఎ కార్యాలయానికి తాళం

**ప్రజాశక్తి - అచ్చంపేట, క్రోసూరు (పల్నాడు జిల్లా)**

నకిలీ పత్తి విత్తనాలు అమ్మిన డీలర్లపై పిడి యాక్ట్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం తాళ్లచెరువుకు చెందిన రైతులు గురువారం ఆందోళన చేశారు. రైతు సంఘం ఆధ్వర్యాన క్రోసూరులోని ఎడిఎ కార్యాలయానికి తాళాలు వేసి అక్కడే బైఠాయించారు. గంగా, కావేరీ రకానికి చెందిన సిక్సర్ పత్తి విత్తనాలు సాగు చేసి తీవ్రంగా నష్టపోయామని, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు గద్దె చలమయ్య, జిల్లా కార్యదర్శి వై.గోపాలరావు, నాయకులు మర్రెడ్డి మాట్లాడారు. తాళ్లచెరువుకు చెందిన 200 మంది రైతులు 600 ఎకరాల్లో గంగా, కావేరి విత్తనాలను జూన్‌లో నాటారని, వంద రోజులైనా కాపు రాకపోవడంతో అక్టోబర్‌లో అధికారులు, శాస్త్రవేత్తలకు సమాచారం ఇచ్చారని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో డీలర్‌పై ఫిర్యాదు చేసినా పోలీసులు అరెస్టు చేయలేదన్నారు. నకిలీ విత్తన కంపెనీలకు ప్రతినిధులుగా ఎమ్మెల్యే, ఎంపి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సిక్సర్ విత్తనాల వల్ల రైతులకు రూ.3 కోట్లకుపైగా నష్టం వాటిల్లిందని, కూలి పనులు సైతం లేక వ్యవసాయ కార్మికులు ఉపాధి కోల్పోయారని, రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకూ రైతుల తరుపున పోరాడతామని స్పష్టం చేశారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఆందోళన కొనసాగింది. ఎడిఎ వి.హనుమంతరావు, పోలీసులు ఆందోళన వద్దకు చేరుకుని రైతులతో మాట్లాడారు. దీనిపై పరిశీలించి న్యాయం చేస్తామని చెప్పి ఎడిఎ అక్కడి నుంచి వెళ్లిపోయారు. రైతులకు న్యాయం చేయకుంటే కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ధర్నాలో నాయకులు ఆర్.వెంకటేశ్వర్లు, ఎ.ఆంజనేయులు, హనుమంతరావు, బాధిత రైతులు ఎన్.కోటేశ్వరరావు, కె.శ్రీను, సిహెచ్.శ్రీనివాసరావు, ఎస్.సురేష్, జి.ఎన్నరెడ్డి, టి.బాలస్వామి, పి.గురవయ్య పాల్గొన్నారు.



ఎడిఎ కార్యాలయం ఎదుట బైఠాయించిన రైతులు, నాయకులు





కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

# 108 ఉద్యోగుల ధర్నా

**ప్రజాశక్తి - ఏలూరు**

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 108 కాంట్రాక్ట్ ఉద్యోగులు ఏలూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. 108 కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో గురువారం ఈ కార్యక్రమం చేపట్టారు. ముందుగా ఏలూరులోని సిఐటియు కార్యాలయం నుంచి ప్రదర్శనగా కొత్తబస్టాండ్, జిల్లా పరిషత్ కార్యాలయం మీదుగా కలెక్టరేట్‌కు చేరుకుని, అక్కడే ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ.. ఉద్యోగులపై అరబిందో సంస్థ వేధింపులకు పాల్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెల వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను సిఎం జగన్ విస్మరించారన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ... కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి పనిచేసిన ఉద్యోగుల పట్ల చిన్నచూపు చూడడం అన్యాయమన్నారు. సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాకు రాష్ట్ర నాయకులు మృత్యుంజయరావు, ఎన్.దినేష్, రాజేష్, రాధిక, సుబ్బరాజు నాయకత్వం వహించారు.

## కూలీలపై దూసుకెళ్లిన టిప్పర్

- డ్రైవర్‌తో సహా ముగ్గురు దుర్మరణం

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్**

వ్యవసాయ కూలీలపై టిప్పర్ దూసుకెళ్లడంతో ఇద్దరు మరణించిన ఘటన కడప జిల్లా జమ్మలమడుగు పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. టిప్పర్ బోల్తాపడి డ్రైవర్ కూడా మరణించారు. పోలీసుల వివరాల మేరకు.. ప్రొద్దుటూరు నుంచి జమ్మలమడుగు వైపుకు వస్తున్న పదిటైర్ల వాహనం ధర్మాపురం గ్రామం వద్ద రోడ్డుపక్కన అన్నం తింటున్న వ్యవసాయ కూలీలపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో గొరిగనూరు గ్రామానికి చెందిన ఇనగనూరు ఓబులేసు (54), ధర్మపురం గ్రామనికి చెందిన యనమల నాగ సుబ్బారెడ్డి (63) అక్కడికక్కడే మృతిచెందారు. అదుపుతప్పి టిప్పర్ పొలంలో పడిపోవడంతో డ్రైవర్ విజయ్ కుమార్ (58) మరణించారు. ఇతను ఉప్పలపాడు గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. విషయం తెలుసుకున్న జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితుల కుటుంబాలను పరామర్శించి, న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



# అసైన్డ్, సీలింగ్ భూములు పేదలకు పంచాలి

- ఎపి వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

**ప్రజాశక్తి - దెందులూరు**

అసైన్డ్, సీలింగ్ భూములను దోసపాడు దళితులకు పంచాలని, లేనిపక్షంలో మరోసారి భూముల్లోకి వెళ్లి స్వాధీనం చేసుకుంటామని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏలూరు జిల్లా దెందులూరులో గురువారం దోసపాడు భూపోరాట పేదలతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. దోసపాడులో దేవినేని బాజీ ప్రసాద్ తన అనుచరులు, బినామీలను పెట్టి గ్రామాల్లో దౌర్జన్యం చేస్తున్నారని తెలిపారు. పేదలు సాగుచేసుకుంటున్న అసైన్డ్, సీలింగ్ భూములను బలవంతంగా ఆక్రమించుకొని సాగుచేసుకుంటున్నారని అన్నారు. సమస్యను పరిష్కరించకుండా కలెక్టర్, రెవెన్యూ అధికారులు, పోలీసులు తాత్సారం చేస్తున్నారని విమర్శించారు. గత ఎనిమిది నెలలుగా పేదల భూములు పేదలకు ఇవ్వాలని కోరుతున్నా పట్టించుకోవడంలేదని తెలిపారు. గత 25 ఏళ్లుగా దళితుల భూములను అనుభవిస్తున్న వారిపై చర్యలు తీసుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు అంతగాని ఆనందరావు, మణి, జాన్‌రాజు, భూపోరాట నాయకులు నాగేంద్ర, తేరాజమ్మ, లలిత, మాణిక్యం, లక్ష్మి పాల్గొన్నారు.



పేదలనుద్దేశించి మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

## పోలీస్ డైరీ ఆవిష్కరణ

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

పోలీస్‌డైరీ-2023ను డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం ఆవిష్కరించారు. మంగళగిరిలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఈ ఏడాది కూడా రాష్ట్ర పోలీసుశాఖకు ప్రజల్లో మంచిపేరు వచ్చేలా పనిచేయాలని అన్నారు. ఎపి పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జనకుల శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజేంద్రనాథ్‌రెడ్డి నెల్లూరు ఎస్‌పిగా ఉన్నప్పుడు 2003లో డైరీ తొలిసారి తీసుకొచ్చామని చెప్పారు. ఇప్పుడు డిజిపిగా ఆయన డైరీని ఆవిష్కరించడం హర్షనీయమని అన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి మస్తాన్‌ఖాన్, నాయకులు వై శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు

**ప్రజాశక్తి - శ్రీశైలం**

శ్రీశైలంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ బ్రహ్మోత్సవాలు ఏడురోజులపాటు జరగనున్నాయి. ఇందులో భాగంగా మొదటి రోజు యాగశాల ప్రవేశం చేసి గణపతి పూజ నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అంకురార్పణ, ధ్వజారోహణ, ధ్వజపతాకావిష్కరణ నిర్వహించారు.



ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు చిన్నయ్యపడాల్

# మమ్మల్ని 'ఆశా'లుగా గుర్తించండి

- పాడేరు ఐటిడిఎ ఎదుట సిహెచ్‌డబ్ల్యుల ధర్నా

**ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)**

తమను ఆశా వర్కర్లుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ పాడేరు ఏజెన్సీలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు (సిహెచ్‌డబ్ల్యులు) అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటిడిఎ ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ.. సిహెచ్‌డబ్ల్యులను ఆశా వర్కర్లుగా మార్పు చేసి నెలకు రూ.10 వేల వేతనం చెల్లించాలని, లేనిపక్షంలో ఐటిడిఎ ముందు సామూహిక నిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు. ఆశా వర్కర్లతో సమానంగా పని చేస్తున్నప్పుడు సిహెచ్‌డబ్ల్యులకు తక్కువ జీతం ఇవ్వడం సరికాదన్నారు. వేతన బకాయిలను చెల్లించాలని, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మూడు సంవత్సరాల నుంచి పల్స్‌పోలియో కార్యక్రమానికి సంబంధించిన డబ్బులు కూడా ఇవ్వలేదని తెలిపారు. సొంత డబ్బులతో యూనిఫాం కొనుక్కోవాలని డాక్టర్లు ఒత్తిడి చేయడం తగదన్నారు. అనంతరం డిఎంఅండ్‌హెచ్‌ఒ జమీల్ బాషాకు, ఎడిఎం అండ్ హెచ్‌ఒ లీలా ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బొండా సన్నిబాబు, ఆశా వర్కర్ల సంఘం జిల్లా కార్యదర్శి వై.మంగమ్మ, నాయకులు టి.ఈశ్వరమ్మ, కె.చిన్నితల్లి, ఎస్.పద్మ, పి.వరలక్ష్మి, పాడేరు ఏజెన్సీ పరిధిలోని 11 మండలాల సిహెచ్‌డబ్ల్యులు పాల్గొన్నారు.

# సొమ్ములిప్పించండి

## ప్రభుత్వానికి కాంట్రాక్టర్ల వేడుకోలు

**ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి**

దీర్ఘకాలంగా బిల్లులకు సొమ్ములివ్వక పోవడంతో అప్పుల పాలయ్యామని, వడ్డీలు కూడా కట్టుకోలేకపోతున్నామని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఆర్థిక, ఇంజనీరింగ్ శాఖలకు రాష్ట్ర బిల్డింగ్ కాంట్రాక్టర్స్ సంఘం లేఖ రాసింది. అప్పుల బాధపడలేక కొంతమంది కాంట్రాక్టర్లు మరణించినట్లు పేర్కొంది. ఇరిగేషన్, రోడ్లు, పబ్లిక్ వర్క్స్ వంటి పనులతోపాటు రాష్ట్రం నేరుగా చేపడుతున్న పనులు, నాబార్డ్, కేంద్ర నిధులతో, ఇతర దేశ, విదేశీ సంస్థల రుణాలతో చేపడుతున్న పనులను కాంట్రాక్టర్లు పూర్తి చేసినప్పటికీ, వాటికి సంబంధించిన నిధులు రావడం లేదని సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. తాము అప్పులు చేసి కింద వారికి వేతనాలు, కూలీలు చెల్లించాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.

చివరకు చేసిన అప్పులకు వడ్డీ కూడా చెల్లించలేక పోతున్నామని కాంట్రాక్టర్లు పేర్కొన్నారు. బ్యాంకులు కూడా తమపై ఒత్తిడి పెంచుతూ తమ ఖాతాలను ఎన్‌పిఎ (నిరర్థక ఆస్తుల జాబితా)లోకి చేరుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో అనేకమంది కాంట్రాక్టర్లు న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయిస్తున్నారని వివరించారు.

సంపాదకీయం

# బండి లాగేదెలా..!

భారీ బరువుల్ని సామూహికంగా ఎత్తేటపుడు, రోడ్ రోలర్ వంటివి లాగేటపుడు, పడవల్ని తెడ్డుతో నడిపేటపుడు అంత కష్టాన్ని అధిగమించడం కోసం 'లాగర లాగర హైలెస్సా..' అని పాడుతుంటారు. కాని, ఆటోమొబైల్ వాహనదారులు బండిలాగేదెలా అనుకునేలా రాష్ట్ర ప్రభుత్వం త్రైమాసిక రవాణా పన్ను పెంపుదలను ప్రతిపాదించడం దారుణం. ఇప్పటికే గ్రీన్ ట్యాక్స్‌ను భారీగా బాది, డీజిల్ పెట్రోల్‌పై హెచ్చు వ్యాట్ విధిస్తున్న ప్రభుత్వం రవాణా పన్ను పెంచడం తగదు. పలు ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్న రవాణా రంగానికిది మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా వుంది. భారీగా పెంచిన గ్రీన్ ట్యాక్స్‌ను తగ్గించాలని ఒక వైపున డిమాండ్ చేస్తుంటే, త్రైమాసిక రోడ్‌ట్యాక్స్‌ను సగటున 30శాతంపైగా పెంచడం పట్ల లారీ యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రవాణా పన్ను పెంపుదల ప్రభావం కొద్ది మంది మీద లేదా ఒకటి రెండు రంగాలపై మాత్రమేగాక పలు విధాలుగా గొలుసుకట్టు ప్రభావం చూపుతుంది. సరుకులు, రవాణా సేవల ధరల పెరుగుదలకు కారణమవుతుంది. దాంతో ప్రజలందరూ ఇబ్బందుల పాలవుతారు. కనుక ఈ పన్ను పెంపు ప్రతిపాదనను ప్రభుత్వం ఉపసంహరించుకోవడం అవశ్యం.

ఆంధ్ర ప్రదేశ్‌లో వసూలు చేస్తున్న రవాణా పన్నులు ఇరుగు పొరుగు రాష్ట్రాలతో పోల్చితే చాలా ఎక్కువని వాహన యజమానులు వాపోతున్నారు. కోవిడ్ సమయంలో అనేక రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా త్రైమాసికాల్లో పన్ను రద్దు చేయగా ఇక్కడ మాత్రం గోళ్లూడగొట్టి వసూలు చేశారు. పొరుగు రాష్ట్రాల్లో కొన్నిటికి 200 రూపాయలు వసూలు చేసే గ్రీన్ ట్యాక్స్ ఇక్కడ 20 వేలుగా ఉందంటే అంతరం ఎన్ని రెట్లు? ఎ.పి లో వ్యాట్ అధికంగా ఉండడంవల్ల డీజిల్, పెట్రోల్ ధరల్లో సరిహద్దు రాష్ట్రాలతో పోల్చితే తీవ్ర వ్యత్యాసం నెలకొంది. ఇలా ఎటు చూసినా దేశమంతా ఒకే మార్కెట్‌గా రూపొందుతున్న ఈ రోజుల్లో రాష్ట్ర రవాణా రంగం ఇతర రాష్ట్రాలతో పోటీ పడలేకపోతున్న దుస్థితి నెలకొంది. ఒకప్పుడు దక్షిణాది రోడ్డు రవాణాలో ఆంధ్రా వ్యాపారం దేదీప్యమానంగా వెలుగొందింది. కాని, ఇప్పుడు పూలమ్మిన చోట కట్టెలమ్ముకునేలా ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రవాణా రంగం కుదేలవ్వడం మూలంగా విజయవాడ ఆటోనగర్ వంటివి కళావిహీనమయ్యాయి. మరోవైపున రోడ్ల మరమ్మతులు లేనందున వాహనాలకు మెయింటెనెన్స్ ఖర్చు విపరీతంగా పెరిగిపోయింది. రాష్ట్ర రవాణా రంగం లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తోంది. అందులో అసంఘటిత కార్మికులు, స్వయం ఉపాధి పొందేవారూ అధికం. ఎక్కువ మందికి ఉపాధి కల్పించే భవన నిర్మాణ రంగం ఇప్పటికే తీవ్ర ఒడిదుడుకుల్లో పడింది. ఇటువంటి వారంతా ఇక్కట్లు పడుతుంటే ఇంకెక్కడి రాష్ట్రాభివృద్ధి? ఒకవైపు ఆర్థిక మాంద్యం ముంచుకొస్తున్న నేపథ్యంలో ప్రజలకున్న ఉపాధి కూడా పోతే రాష్ట్రం ఏమవుతుంది?

పన్నులు పెంచకుండా ఖజానాకు ఆదాయం రాబట్టడమెలా? ఉద్యోగుల జీత భత్యాల మొదలు సంక్షేమ పథకాల అమలు చేసేదెలా అని కొందరు ప్రశ్నించవచ్చు. అది కూడా చూస్తే రవాణా రంగంలో సర్కారు ఆదాయం ఏమీ తక్కువగా లేదు. వాహనాలకు జీవిత పన్ను, త్రైమాసిక పన్నుల పేరిట ఏడాదికి దాదాపు ఐదు వేల కోట్లు సమకూరుతోంది. కేవలం పన్నులేగాక రవాణా శాఖ ఫైన్లు కూడా దండిగానే వేస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో ఫైన్ల ద్వారా రూ. 262.90 కోట్లు లక్ష్యానికిగానూ రూ.272.83 కోట్లు వసూలు చేసినట్టు ఇటీవల జరిపిన ఆ శాఖాసమీక్షలో వెల్లడైంది (ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు, మినీ ట్రాన్స్‌పోర్టు వారిపై పోలీసు శాఖ వేసే ఫైన్లు ఇందులోకి రావు). రైతు పండించిన పంటలు, పండ్లు, కూరగాయల మొదలు రాష్ట్రం ముందు పీఠినవున్న మత్స్య ఉత్పత్తుల వరకు అన్నిటికీ మార్కెట్ కల్పనలో రోడ్డు రవాణా రంగం పాత్ర కీలకమన్న విషయం మరువరాదు. బహుముఖంగా ప్రభావితం చేసే ఈ రంగంపై అదనపు పన్నులు వేయడం తగదు. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి, ఉపసంహరించుకోవడం విజ్ఞతగా ఉంటుంది.

మహనీయుల మాట



**నీతి, నిజాయితీ, నిబద్ధత, అసూయ ద్వేషాలకు తావు లేకుండా...వైద్యులు తమ వృత్తిని సమాజ కళ్యాణానికి, రోగ నిరోధానికి వినియోగించాలి.**

**- హిపోక్రిటస్,**
**ప్రాచీన గ్రీకు వైద్య విజ్ఞాని.**

# జోషీమఠ్....మానవ తప్పిదమే

కామెంట్

పర్యావరణ లేదా సామాజిక సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా చేపట్టే అభివృద్ధి పనులు ప్రగతికి దారి తీయవని... అధికారులను ముఖ్యంగా ప్రస్తుత ప్రభుత్వ హయాంలోని అధికార యంత్రాంగాన్ని ఒప్పించాలంటే పూర్తిగా విపత్తు జరిగితే కాని వారికి అర్థమవనట్లు కనిపిస్తోంది. బద్రీనాథ్‌కు ముఖద్వారంలా భావించే పవిత్ర పట్టణమైన జోషీమఠ్‌లో చోటు చేసుకుంటున్న విషాదం, ఉత్తరాఖండ్ హిమాలయాల్లో వరుసగా జరుగుతూ వస్తున్న విషాదాలు, విపత్తుల్లో తాజాది. అడ్డూ అదుపులేని నిర్మాణాలు, మౌలిక వసతులు, పట్టణీకరణ వంటి చర్యల కారణంగా ఈ పరిస్థితి ఏర్పడుతోంది. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ లోని పశ్చిమ హిమాలయాల్లో ఇలా మానవ తప్పిదాల కారణంగా సంభవిస్తున్న విపత్తులు ఇటీవల కాలంలో బాగా ఎక్కువవుతున్నాయి. మానవ ప్రేరిత వాతావరణ మార్పులు-భారీగా వర్షాలు పడడం ఫలితంగా వరదలు సంభవించడం, కొండ చరియలు విరిగిపడడం వంటివి-ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి.

ఆరు వేల అడుగుల ఎత్తులో వున్న జోషీమఠ్‌లో చాలా చోట్ల నేల కుంగుతుండడంతో పెద్దగా పగుళ్ళు ఏర్పడి ఇళ్ళు, భవనాలు, రోడ్లు బీటలు వారుతున్నాయి. పట్టణంలో దాదాపు నాలుగో వంతు ఇలాగే దెబ్బ తింది. ఇప్పటి వరకు బాగా ప్రభావితమైన నాలుగు జోన్‌లలో 720కి పైగా ఇళ్ళు తీవ్రంగా దెబ్బ తిన్నాయని అంచనా వేశారు. 89 భవనాలను తక్షణమే కూల్చివేసేందుకు గుర్తించారు. ఇవి నివాసయోగ్యతకు అనువుగా లేవని, పైగా వీటివల్ల సమీప భవనాలు కూడా ప్రమాదంలో పడతాయని భావించారు. ఆ 89 భవనాల్లో నివాస భవంతులు, హోటళ్ళు వున్నాయి. వందలాది మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మిగిలినవారు ఈ తరలింపు ప్రక్రియ కోసం ఎదురుచూస్తున్నారు. ఇదిలా వుండగా, గతంలో పదే పదే హెచ్చరికలు వచ్చినప్పటికీ వాటిని పట్టించుకోకుండా జిల్లా యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం చివరకు కేంద్ర ప్రభుత్వం కూడా చాలా ఉదాసీనంగా వ్యవహరించడం వల్లనే తమ పట్టణం ఇంతలా విధ్వంసానికి గురవుతోందంటూ జోషీమఠ్ బాధితులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఆందోళనలకు దిగుతున్నారు. దెబ్బతిన్న భవనాల నుండి తక్షణమే తమను తాత్కాలిక షెల్టర్లకు తరలించాలని, నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. తమను కూడా దేశంలోని 'అభివృద్ధి శరణార్థుల' జాబితాలో చేర్చాలని కోరుతున్నారు. ఒకపక్క ప్రజలు తమ ఇళ్ళను, ఆదాయాలను, జీవనోపాధులను కోల్పోతుంటే...మరోపక్క కాంట్రాక్టర్లు, కమర్షియల్ ప్రాజెక్టులు మాత్రం విధ్వంసకర అభివృద్ధి ఫలాలను అనుభవిస్తున్నారు. జోషీమఠ్ విపత్తు వల్ల దెబ్బతిన్న వారికి, ప్రభుత్వ ఉద్దేశ్యపూర్వక నిర్లక్ష్యానికి బాధితులైన వారందరికీ పూర్తి స్థాయిలో పునరావాసం కల్పించాలి. తమకు రావాల్సిన వాటి కోసం నిరవధికంగా వేచి వుండే పరిస్థితి లేకుండా తక్షణమే వారికి అందాల్సిన నష్టపరిహారం అందచేయాలి.



**గతంలో పదే పదే హెచ్చరికలు వచ్చినప్పటికీ వాటిని పట్టించుకోకుండా జిల్లా యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం చివరకు కేంద్ర ప్రభుత్వం కూడా చాలా ఉదాసీనంగా వ్యవహరించడం వల్లనే తమ పట్టణం ఇంతలా విధ్వంసానికి గురవుతోందంటూ జోషీమఠ్ బాధితులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఆందోళనలకు దిగుతున్నారు. దెబ్బతిన్న భవనాల నుండి తక్షణమే తమను తాత్కాలిక షెల్టర్లకు తరలించాలని, నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. తమను కూడా దేశంలోని 'అభివృద్ధి శరణార్థుల' జాబితాలో చేర్చాలని కోరుతున్నారు. ఒకపక్క ప్రజలు తమ ఇళ్ళను, ఆదాయాలను, జీవనోపాధులను కోల్పోతుంటే...మరోపక్క కాంట్రాక్టర్లు, కమర్షియల్ ప్రాజెక్టులు మాత్రం విధ్వంసకర అభివృద్ధి ఫలాలను అనుభవిస్తున్నారు.**

అయితే, సున్నితంగా వుండే పర్వత పర్యావరణ వ్యవస్థను, దాని దుర్బలత్వాలను పరిగణన లోకి తీసుకోకుండా ప్రమాదకరమైన పట్టణీకరణ చర్యలు చేపట్టడం, రహదారులు, జల విద్యుత్ ప్రాజెక్టులకు సంబంధించి నిర్మాణ కార్యకలాపాలను కొనసాగిస్తున్న సమస్యను తప్పనిసరిగా పరిష్కరించాల్సి వుంది. జోషీమఠ్ విపత్తు తర్వాత తక్షణ స్పందన చర్యలకు సంబంధించిన నిర్ణయాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారుల సమావేశంలో తీసుకున్నారు. జాతీయ విపత్తు నిర్వహణా సంస్థ, భారత జియాలాజికల్ సర్వే, జాతీయ జల విద్యుత్ సంస్థలు గతంలో ఇచ్చిన నివేదికలు, వాడియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ జియా లజీ

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

పెంచిన ప్రమాద సూచి ఒకలను పట్టించుకోలేదు. దాదాపు 50 ఏళ్ళ క్రితం నాటి ప్రఖ్యాత ఎం.సి.మిశ్రా కమిటీ నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ నివేదికతో సహా ఈ సంస్థలు ఇచ్చిన అధ్యయనాల నివేదికలు, ఇతర నిపుణులు ఈ ప్రాంత భౌగోళిక స్వరూపాన్ని, భూకంపాల పరంగా ఈ ప్రాంత దుర్బలత్వాన్ని, ప్రధాన నిర్మాణ కార్యకలాపాల పర్యవసాన ప్రమాదాలను నొక్కి చెప్పాయి. చాలా బలహీనమైన, అస్థిరమైన నేలపై...గతంలో కొండ చరియలు విరిగిపడడం, హిమనదీ ప్రవాహాల వల్ల వదులైన నేలతో కూడిన రాతి ఉపరితలంపై... జోషీమఠ్, ఈ ప్రాంతంలోని పలు ఇతర పట్టణాలు నిర్మించబడ్డాయని ఈ నిపుణులు తెలిపారు. దీనివల్ల నివాసితులు, పర్యాటకుల పరంగా ప్రమాదకర స్థాయిలో పెరుగుతున్న భారాలను మోసే సామర్థ్యం పరిమితమవుతోంది. భూకంపాలు వచ్చే జోన్-5గా ఈ ప్రాంతాన్ని వర్గీకరించారు. అంటే భూకంపాలు ప్రకంపనలు రావడానికి అత్యధికంగా అవకాశమున్న ప్రాంతంగా గుర్తించారు. దీనికి తోడు, ఈ ప్రాంతంలో బ్లాస్టింగ్‌లు జరపడం, సొరంగాలు తవ్వడం వంటి భారీ నిర్మాణ కార్యకలాపాలతో పరిస్థితి మరింత తీవ్రతరమైంది. పేలవమైన నిర్మాణ ప్రణాళికల కారణంగా సహజసిద్ధమైన నీటి పారుదలకు ఆటంకం ఏర్పడి స్తంభించిపోవడం కూడా ఈ ప్రాంత అస్థిరతకు, కొండచరియలు ఎక్కువగా విరిగి పడేందుకు కారణమైంది. ఫలితంగా, జోషీమఠ్ ప్రాంతం ఏడాదికి 6.5 సెంటీమీటర్లు చొప్పున కుంగుతోందని ఉపగ్రహ డేటా వెల్లడిస్తోంది.

ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ దామి దీన్ని ప్రకృతి విపత్తుగా అభివర్ణిస్తూ, తప్పుదారి పట్టిస్తున్నారు. కాగా మరోవైపు, ఎన్‌టిపిసి చేపట్టిన తపో వన్-విష్ణుగఢ్ జల విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణ కార్యకలాపాల్లో భాగంగా చేపట్టిన సొరంగం పట్టణానికి, జోషీమఠ్-బద్రీనాథ్ హైవే కి దగ్గరగా వుంది. అయితే స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో దీన్ని నిలిపివేశారు. ఈ ప్రాంతంలో పేలుళ్ళను నిషేధించారు. కానీ వివిధ నిర్మాణ ప్రాంతాల్లో బ్లాస్టింగ్ షెడ్యూళ్ళను ప్రకటించే సైన్ బోర్డులను స్థానికులు ఎత్తి చూపిస్తున్నారు. ఇప్పటికీ, నిర్మాణాలపై నిషేధం వున్నప్పటికీ, ఎలాంటి పర్యవేక్షణ లేకపోతే, ఏదో కొంత నిర్మాణ కార్యకలాపాలు ఆ ఏరియాలో కొనసాగుతూనే వుంటాయని టి.వి చానెళ్ల చెబుతున్నాయి. ఇలా మొత్తంగా నియంత్రణ లేకపోవడం, నిబంధనల అమలు లేకపోవడం అనేది ఈ ప్రాంతంలోని మౌలిక నిర్మాణ కార్యకలాపాలన్నిట్లో కనిపిస్తుంది. ప్రధాన పుణ్యక్షేత్రాలతో కలిపే ప్రసిద్ధ చార్‌ధామ్ హైవేను విస్తరించడానికి సుప్రీం కోర్టు అనుమతించింది. దాంతో ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగింది. ఆ కార్యకలాపాలపై ఎలాంటి నియంత్రణలు విధించలేదు. 'ఎలాంటి మూల్యాన్ని చెల్లించైనా అభివృద్ధిని సాధించాలనే' ఈ వైఖరికి జోషీమఠ్ ఈనాడు మూల్యాన్ని చెల్లిస్తోంది.

జోషీమఠ్ లోని ఇతర ప్రాంతాల్లో కూడా రాబోయే నెలలు, సంవత్సరాల్లో ఇలా నేల కుంగుబాటుకు గురయ్యే అవకాశం వుంది. ఈ ప్రాంతంలోని ఇతర పట్టణాలు, ప్రాంతాలు కూడా ఇలాగే దుర్బలంగా వున్నాయి. రుద్రప్రయాగ్ లోయలో కూడా ఇప్పటికే ఇళ్ళకు, ఇతర భవనాలకు పెద్ద పెద్ద పగుళ్ల వస్తున్నట్లు వార్తలు వచ్చాయి.

ప్రస్తుతం జోషీమఠ్ విపత్తును ఎదుర్కొనడానికి ఏ విధమైన చర్యలు తీసుకున్నా దానికన్నా ముందుగా దుర్బలమైన పశ్చిమ హిమాలయాల పర్వత సానువుల్లో మౌలిక వసతులు, ఇతర నిర్మాణ కార్యకలాపాలకు సంబంధించి అవసరమైన సమగ్ర సమీక్ష జరగాల్సి వుంది. స్థానికులకు, పర్యాటకులకు జరిగే ప్రమాదాన్ని కనీస స్థాయికి తగ్గిస్తూ పర్యావరణపరంగా సున్నితమైన అభివృద్ధిని సాధించే దిశగా బాగా ఆలోచించిన మార్గాన్ని అనుసరించాల్సి వుంది.

**('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)**

కవిత్వం

## కూసింత స్వేచ్ఛగావాలి సారూ..!!

మా బొక్కెల్ని ఇరిసి పొయ్యిలోబెట్టి
నాల్గు మెతుకుల్ని కడుపునకేత్తాం
తిరగడాన్కి అడగడాన్కి కాయింత
స్వేచ్ఛగావాలి సారూ
మా బతుకులు గతుకులెంబడి
ఉరుకులు పరుగులెట్టినా పర్లే
మోకాళ్ళపై దేకుతానే ఇద్చేత్తాం
బయట ప్రశ్నించడాన్కింత
స్వేచ్ఛ కాయింత కావాలి సారూ
గుక్కెడు నీళ్ళకింత గల్లీలు తిరగేత్తాం
బుక్కెడు బువ్వకింత బొక్కెల్నిరుస్తాం
మా గతి మేం పడ్తాలెత్తా
ఏడేడనో వుండి కాలాన్ని దొబ్బేత్తాం
మీకేసి కంట్రెప్పల్ని ఆడించడం ఆపేయం
ఏదో సేత్తారనే ఆశల్ని పోగేత్తా
బోగి మంటల్ని ఏపెత్తున మండించం
మా ఎంగిలి మేం పడతా
తిప్పలన్నీ కుంపటిలా మోసుకుంటాం
కానీ కాలు కదపడాన్కింత
నోరు మెదపడాన్కింత
స్వేచ్ఛగాలి పీల్చడాన్కింత
కూసింత స్వేచ్ఛగావాలి సారూ
మెడ తిప్పితే మొటిక్కాయలేత్తరు
కాదన్నకాడ కాగడాలెలిగిత్తరు
మెదల్డానికింత స్వతంత్రాన్ని
మీకాడనే తీసుకోవాలంటూ
ఆంక్షల్ని అడ్డేసి కదల్నివ్వరు
అయ్యా సారూ ఇట్టా సూడండి
నియంతను కొండంత చేసి
నినాదాల నియంత్రణకై నడుంగట్టి
అడిగే స్వేచ్ఛ రాసే స్వేచ్ఛపై
మన్నుగప్పి ఆనవాళ్లను మాయం చేస్తరు
బతకనీకి మా అగచాట్లు మేం పడతాం
ఇసుమంత చేదోడు వద్దులేగానీ
సమాజంతో మెలగడానికింత
కూసింత స్వేచ్ఛగావాలి సారూ.


**- నరెడ్డుల రాజారెడ్డి**
**సెల్ : 9666016636**

# మానవతావాదులు మనలోనే వున్నారు!

కామెంట్స్

"ప్రపంచం మారాలని మనం కోరుకోవడం కాదు. మార్పు మనతోనే మొదలయితే-ప్రపంచం అదే మారుతుంది!" అంటాడు ప్రపంచ ప్రసిద్ధ రష్యన్ రచయిత లియో టాల్‌స్టాయ్.

వృద్ధాప్యంలో కన్నబిడ్డలు వదిలేసినా, పూర్వ విద్యార్థులు పూనుకుని, తమ ఉపాధ్యాయురాలిని చేరదీసిన సంఘటన కేరళ లోని మలప్పురంలో జరిగింది. అక్కడ ఒక ప్రయివేటు పాఠశాలలో ఒకప్పుడు ఎంతో తెలివైన ఉపాధ్యాయురాలిగా పేరున్న ఒక టీచర్ కాలక్రమంలో వీధిపాలైంది. స్వంత కొడుకులు, కూతుళ్ళు ఆమెను వదిలేశారు. జీవిత చరమాంకంలో ఆమె చాలా కష్టాలపాలైంది. కూడూ, గూడూ లేక వీధుల్లో తిరగాల్సి వచ్చింది. తన వాళ్ళంతా ఎక్కడికి వెళ్ళారో ఎక్కడ ఉన్నారో కూడా ఆమెకు తెలియదు. చివరకు బతకడానికి రైల్వే స్టేషన్ ముందు బిచ్చమెత్తుకోవలసి వచ్చింది. ఎందరి ఛీత్కారాలకో గురవుతూ, మొండిగా అక్కడక్కడే కాలం గడుపుకోసాగింది. అలాంటి పరిస్థితుల్లో ఒకసారి ఒక పూర్వ విద్యార్థిని ఆమెను గమనించింది. అతి కష్టం మీద గుర్తుపట్టింది. దగ్గరికి వచ్చి వివరాలు అడిగింది. అంతే! ఆమె తనకు పాఠాలు చెప్పిన విద్యా టీచర్ అని పూర్తిగా నమ్మింది. తనను దివ్యగా పరిచయం చేసుకుంది. తనది ఏ బ్యాచో, తన బ్యాచిలో ఎవరెవరు ఉండే వారో చెప్పుకుంది. సంభాషణలు సంబంధాన్ని మరింత బలపరిచాయి. ఒకప్పుడు ఎంతో గౌరవం గా బతికిన విద్యా టీచర్ జీవితం అలా కావడం ఆ పూర్వ విద్యార్థినికి నచ్చలేదు. ఎంతగానో బాధపడింది. ఊరికే బాధపడితే లాభమేమిటీ? ఏదో చేయాలని అనుకుంది. ఒకప్పటి ఆ విద్యార్థిని దివ్య-ఇప్పుడు ఐఏయస్ అధికారి. వెంటనే ఆమెను తన ఇంటికి తీసుకువెళ్ళి స్నానం చేయించి, వేరే శుభ్రమైన బట్టలిచ్చి, భోజనం పెట్టి పడుకోబెట్టింది. అధికారి గనుక, దగ్గరలో అన్ని వసతులు ఉన్న చిన్న ఇల్లు వెతకండని మనుషుల్ని పంపింది.



**డా|| దేవరాజు మహారాజు**

తనతో చదువుకున్న పూర్వ విద్యార్థినీ విద్యార్థుల్ని సంప్రదించింది. విషయం వారందరికీ తెలియజేసింది. అంతే కాదు, తన సర్కిల్‌లో ఉన్న పెద్ద పెద్ద వాళ్ళకు చెప్పి, అందరినీ కదిలించింది. తన విద్యాటీచర్ భవిష్యత్ కోసం కొంత నిధి ఏర్పాటు చేసింది. అలా తమ స్కూలు టీచర్‌కు మంచి జీవితం అందించాలన్న పూర్వ విద్యార్థుల సంకల్పం నెరవేరింది. తను చొరవ తీసుకుని, అందరినీ కలుపుకుని సమిష్టిగా ఒక ప్రయత్నం చేసి విజయురాలైంది ఐఏయస్ దివ్య. కన్నవాళ్ళు నిర్దాక్షిణ్యంగా ఆమె ఆస్థి కాజేసి, నిస్సహాయురాలిని చేసి రోడ్డున పడేసినా, ఒక టీచర్, తన విద్యార్థుల సహకారంతో మళ్ళీ గౌరవప్రదమైన జీవితంలోకి రావడం ఇక్కడ చెప్పుకోవాల్సిన విషయం.



**ప్రతి ఒక్కరిలో మానవీయ విలువలు నిక్షిప్తమై ఉంటాయి. వాటిని మనం జాగృతం చేసుకుంటూ ఉండాలి. మానవతావాదులు మనలోనే ఉన్నారు. అంటే... మన మధ్యే ఉన్నారని అర్థం. అంతేకాదు, మనలో అంటే ప్రతి ఒక్కరి మనసుల్లో ఉంటారు. స్వార్థం, కుత్సిత బుద్ధి పక్కన పెడితే, మనుషులంతా మానవతావాదులే.. కదా? డబ్బూ, అధికారం చాలా మంది దగ్గర ఉంటాయి. అయితే వాటిని మానవత్వ కోణంలోకి మార్చి, తమ చుట్టూ ఉన్నవారి జీవితాల్ని బాగుచేయాలనుకోవడం గొప్ప సామాజిక సేవ!**

విద్యాటీచర్ తను ఉద్యోగంలో ఉన్నప్పుడు బోధించిన పాఠాల సారాంశం, అందించిన సంస్కారం ఆ పూర్వ విద్యార్థుల్లో పనిచేసింది. ఆమె ఎంత నిజాయితీగా నిబద్ధతతో పాఠాలు చెప్పకపోతే, ఆమె తన విద్యార్థినీ విద్యార్థులకు అంత ప్రీతిపాత్రురాలు కాగలదూ? అలా పదేళ్ల తర్వాత కూడా వాళ్ళు ఎందుకు తరలివచ్చారూ? ప్రతి ఒక్కరిలో మానవీయ విలువలు నిక్షిప్తమై ఉంటాయి. వాటిని మనం జాగృతం చేసుకుంటూ ఉండాలి. మానవతావాదులు మనలోనే ఉన్నారు. అంటే... మన మధ్యే ఉన్నారని అర్థం. అంతేకాదు, మనలో అంటే ప్రతి ఒక్కరి మనసుల్లో ఉంటారు. స్వార్థం, కుత్సిత బుద్ధి పక్కన పెడితే, మనుషులంతా మానవతావాదులే.. కదా? డబ్బూ, అధికారం చాలా మంది దగ్గర ఉంటాయి. అయితే వాటిని మానవత్వ కోణంలోకి మార్చి, తమ చుట్టూ ఉన్నవారి జీవితాల్ని బాగుచేయాలనుకోవడం గొప్ప సామాజిక సేవ!

మన సమాజంలో ఇలాంటి పనులు ఎంతమంది చేస్తున్నారూ? అని నిట్టూర్పులు విడిచి, నిరాశపడకుండా "మనమేమైనా చేయగలమా?" అని ఎవరికి వారు కార్యాచరణకు పూనుకోవాలి. వారి పరిధిలో వారు చేయగలిగింది చేయడానికి సిద్ధపడాలి. మానవవాదులంటే ఎవరో ప్రత్యేకంగా ఉండరు. మనలోనే ఉంటారు. మన ఆలోచనల్లోనే ఉంటారు. చేయవల్సిందల్లా 'వారిని' బయటికి తీయడమే. అంటే ఆ ఆలోచనలతోనే మరో పదిమందికి స్ఫూర్తినందించడం. జిలుగు వెలుగుల సినిమా రంగంలో ఉండి కూడా ప్రజల పక్షాన నిలిచిన నటులు కొందరు మనకు ఉన్నారు. అందులో ముఖ్యంగా చెప్పుకోదగ్గవాడు నానా పటేకర్. తన ఆదాయంలో తొంభయి శాతం ఛారిటీలకు ఇచ్చారు. గతంలో కార్గిల్ యుద్ధ సమయంలో సైన్యానికి వెన్నుదన్నుగా నిలబడ్డారు. తన ఆదాయంలో ఎక్కువ మొత్తం రైతుల అభ్యున్నతికి ఖర్చుపెట్టారు. కరువుకు గురైన నాలుగు గ్రామాల్ని దత్తతకు తీసుకున్నారు. పేద ప్రజల కొరకే తన జీవితం అన్నట్లుగా అన్ని వేళలా వారికి అండగా ఉంటున్నారు. ఉదాహరణకు ఇక్కడ ఒక్క నానా పటేకర్ గురించి చెప్పుకున్నాం. కానీ, సమాజంలో అక్కడక్కడా ఇలాంటి వారు ఉన్నారు. ఇలాంటి వారి సంఖ్య గణనీయంగా పెరగాల్సిన అవసరం ఉంది. ఆ ప్రయత్నం మనలోంచే ప్రారంభం కావాలి! అలాగే ఇటీవల కరోనా లాక్‌డౌన్ సమయంలో వలస కార్మికులకు రవాణా సౌకర్యం కల్పించి, స్వంత ఖర్చుతో వారిని వారి వారి గమ్యాలకు చేర్చిన ఘనత నటుడు సోనూ సూద్‌కు చెందుతుంది. వెండితెర మీద విలన్లుగా నటించినా, నిజ జీవితంలో గొప్ప హీరోలుగా నిలిచారు.

"ప్రయత్నిస్తూ ఉండే వారికి సాధ్యం కానిది ఏదీ ఉండదు" అన్నాడు అలెగ్జాండర్ ద గ్రేట్.

"జీత్ తొ పతా నహీ లేకిన్ యె చరాగ్
కం సె కం రాత్ క నుక్సాన్ బహుత్ కర్తాహై" ఉరుదూ కవి ఇర్ఫాన్ సిద్దీఖీ. విజయం సంగతి తెలియదు కానీ, ఈ దీపం రాత్రికి చాలా నష్టం కలిగిస్తుంది - అని అర్థం. ఇందులో రాత్ అంటే రాత్రి. అమానవీయత - రాత్రిగాక మరేమిటీ? ఆశ అనే దీపం - ప్రయత్నమనే దీపం పట్టుకుని పోతూ ఉంటే చీకట్లు వాటికవే తొలగిపోతుంటాయన్న ఆశావాద దృక్పథం ఈ చరణాలలో ఉంది. సమకాలీనంలో జరుగుతున్న ఘోరాల్ని చూసి బెంబేలెత్తిపోవడం కాదు, ప్రయత్నించి ఎదుర్కొంటూ పోతేనే విజయం వరిస్తుంది.

కేరళ కోజికోడ్ జిల్లాకు చెందిన శశి తల్లితో కలిసి ఒక చిన్న ఇంట్లో ఉంటున్నాడు. కొన్నేళ్ల క్రితం బ్యాగుల పరిశ్రమ పెట్టేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుండి యాభై వేలు లోన్ (అప్పు) తీసుకున్నాడు. అసలూ, వడ్డీ ఏదీ చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు ఇంటిని జప్తు చేసేందుకు వెళ్ళారు. శశి నిస్సహాయత, కూలిపోయే అతని పాత ఇంటిని చూసి చలించిపోయారు. తొమ్మిది మంది ఉద్యోగులు కలిసికట్టుగా తమ స్వంత డబ్బుతో అతడి ఇల్లు బాగు చేయించి ఇచ్చారు. అంతే కాదు, ఆ బ్యాంకు ఉద్యోగులే తమ స్వంత డబ్బుతో అతడి బ్యాంకులోన్ చెల్లించారు. దేశంలో ఇలాంటి వారు కూడా ఉన్నారు. ప్రతి ఒక్కరి అకౌంట్‌లో పదిహేను లక్షలు వేస్తానన్నవాడు రెండుసార్లు ప్రధానిగా వెలిగిపోయాడు గానీ, ఇలాంటి ఏ చిన్న పాటి సహాయమూ దేశంలో ఎవరికీ చెయ్యలేదు. ఇలాంటి సంఘటనే మరొకటి జరిగింది. రైతు తీసుకున్న అప్పు సకాలంలో బ్యాంకుకు తిరిగి చెల్లించలేదని ఒక బ్యాంకర్ కోర్టులో పిటిషన్ వేశాడు. ఆ పిటిషన్‌ను జస్టిస్ చంద్రచూడ్ కొట్టేశారు. "రైతు అప్పు చెల్లించలేదని అతన్ని కోర్టుకు లాగుతారా? ముందు అప్పు ఎగ్గొట్టి పారిపోయిన "పెద్ద దొంగలను"... పట్టుకోండి!" అంటూ ఆయన తన తీర్పులో సూచించారు. ప్రకృతి పరిరక్షణ కార్యకర్త డాక్టర్ వందనా శివ అంటారు-"భూమి హక్కులను రక్షించుకోవడమన్నది అత్యంత ముఖ్యమైన విషయం. ఇదే మన కాలంలో మనం జరిపే అతి పెద్ద శాంతి ఉద్యమం. సామాజిక న్యాయాన్ని, మానవ హక్కులను రక్షించడం అందులో భాగమే!" ఒక స్థాయికి ఎదిగి ఆలోచించే వారికి మాత్రమే ఆమె మాటలు అర్థమవుతాయి. భూమిలో రైతుకు మాత్రమే కాదు, మనుషులందరికీ ఉన్న సంబంధం గూర్చి అవలోకించగలగాలి. అది మానవతావాదులైతే గాని చేయలేరు! ఇండోనేషియాలో ముస్లింలు తొంభైయి శాతం. హిందువులు రెండు శాతం. మిగతా ఎనిమిది శాతం ఇతర మతస్థులు. అలాగే అమెరికాలో డెబ్బయి శాతం క్రైస్తవులు, ముప్పయి శాతం ఇతర మతస్థులు. అయినా, అక్కడ మతాన్ని అడ్డుపెట్టుకుని ఎవరూ రాజకీయాలు చేయడంలేదు. అల్లర్లు లేవు. మెజారిటీలదే రాజ్యం అని కూడా అనడం లేదు. మన దేశంలో ఆరెస్సెస్, బీజేపీలు అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఈ దేశం హిందువులదేనని అంటున్నారు. మిగతా మతస్థులపై దాడులు చేస్తున్నారు. ఇక్కడ మరొక విచిత్రం జరుగుతూ ఉంది. ఆవు పాలు నేల పాలు చేస్తారు. ఆవు నెయ్యి నిప్పులో తగలేస్తారు. ఆవు మూత్రం మాత్రం తాగుతారు. ఇలాంటి పరిస్థితి ప్రపంచంలోని ఏ దేశంలోనూ లేదు. కొందరికి-ముస్లింలు ప్రమాదంలో ఉన్నారని అనిపిస్తుంది. మరి కొందరికి-హిందువులు ప్రమాదంలో ఉన్నారని తోస్తుంది. అసలు విషయమేమంటే... దేశమే ప్రమాదంలో ఉందన్నది అందరూ గ్రహించాల్సి ఉంది. దీనికి ఒక్కటే పరిష్కారం - జాతి, మత, కుల, ప్రాంతీయ భేదాల్ని పక్కకు నెట్టి కలిసి మెలిసి జీవించడమే! మానవతావాదులన్న వారు కుల మతాల్ని తప్పనిసరిగా త్యజించాలి. ఆర్థిక స్తోమతల్ని పట్టించుకోగూడదు. మానవాభ్యుదయమే ధ్యేయంగా ఆధునిక స్త్రీ పురుషులందరూ కలిసికట్టుగా ఒక మానవతావాద ప్రపంచాన్ని సృష్టించుకోవాలి!

**/వ్యాసకర్త: కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత, జీవశాస్త్రవేత్త/**

జనవ్యాకం

## ఉక్రోష వీరులతో ఉపద్రవం

ప్రజాస్వామ్యానికి, ప్రజాభిప్రాయానికి విలువనివ్వని ధోరణి సమాజానికి చేటు. బ్రెజిల్‌లో నిన్నటిదాకా అధ్యక్ష పీఠంపై ఉన్న మితవాది బోల్సనారో అధ్యక్ష ఎన్నికల్లో ఓడిపోయాడు. కొత్త అధ్యక్షుడిగా లూలా ని ప్రజలు తమ తీర్పు ద్వారా పట్టం కట్టారు. ఓటమి రూఢి అయిన ఉత్తర క్షణమే బోల్సనారో ఎన్నికల ప్రక్రియనే తప్పుపట్టాడు. అందరూ కలిసి కుట్ర చేసి తప్పుడు ఫలితాల్ని తెప్పించారంటూ ఆ ఫలితాల్ని ఫేక్‌గా ప్రచారం చేశాడు. తన మద్దతుదారుల్ని రెచ్చగొట్టి తాను అమెరికా యాత్ర చేపట్టాడు. ఆ మహానుభావుడి అనుచర గణం అక్కడి పార్లమెంట్‌ని, సుప్రీం కోర్టుని చుట్టుముట్టి విధ్వంసం సృష్టించింది. అయినా వారిని వారించిన పాపాన పోలేదు. అధ్యక్ష స్థానాన్ని అలంకరించిన పెద్దమనిషి ఓడిపోగానే చేసిన నిర్వాకమిది. గెలిస్తే తమ గొప్ప. ఓడితే ఎదుటివారి కుట్ర. అంతే. తమ వాదనకు అనుగుణంగా అనుచరుల్ని సమాయత్తం చేస్తారు. అక్కడి లూలా ప్రభుత్వం ప్రజల్లో అవగాహన పెంచుతూ బోల్సనారో చర్యల్ని ఎండగట్టి, నియంత్రించాల్సిన అవసరం ఉంది.

**- డా.డి.వి.జి.శంకరరావు,**
**మాజీ ఎంపీ, పార్వతీపురం.**

## సవరణ

10.1.23న ప్రచురితమైన 'ప్రభుత్వ బ్యాంకులను ప్రైవేటీకరణకు సిద్ధం చేసిన మోడీ' వ్యాసం పదవ పేరాను కింది విధంగా చదువుకోగలరు. "ఏడు సంవత్సరాల కాలంలో (2010-2011 నుంచి 2017-2018 వరకు) కేంద్ర బడ్జెట్ నుండి బ్యాంకులకు పెట్టిన పెట్టుబడులు ప్రజల డబ్బులే. బ్యాంకుల నుండి తీసుకున్న అప్పు తిరిగి చెల్లించేది ప్రజల డబ్బులే. 2015-2016 నుండి 2021-2022 వరకు 7 సంవత్సరాల కాలంలో ప్రభుత్వ రంగ బ్యాంకుల నిర్వహణా లాభాలు రూ.14,91,177 కోట్లు కార్పొరేట్ కంపెనీలు కట్టాల్సిన పారు బకాయిల స్థానంలోకి తరలించబడ్డాయి".

**- ఎడిటర్**

## తక్షణమే సేతు సముద్రం ప్రాజెక్టు

- కేంద్రాన్ని కోరుతూ తమిళనాడు అసెంబ్లీ తీర్మానం



**చెన్నై :** ఎటువంటి జాప్యం లేకుండా సేతు సముద్రం ప్రాజెక్టును తక్షణమే చేపట్టాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తమిళనాడు అసెంబ్లీ గురువారం ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించింది. ఈ ప్రాజెక్టు అమలుకు అవసరమైన సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందచేస్తుందని హామీ ఇచ్చింది. ప్రధాన ప్రతిపక్షం అన్నాడిఎంకె, దాని మిత్రపక్షం బిజెపి కూడా ఈ తీర్మానానికి మద్దతిచ్చాయి. అయితే ఆ ప్రాంతంలో నిరంతరంగా బురదను తవ్వుతూ వుండాల్సిన అవసరమున్నందున ఈ ప్రాజెక్టు అమల్లో మంచి చెడులపై అధ్యయనం చేయాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరాయి. తమిళనాడు, మొత్తంగా దేశ ఆర్థికాభివృద్ధిని బలోపేతం చేయడానికి ఈ సేతు సముద్రం ప్రాజెక్టు కీలకమైనదని తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు.

## బెంగాల్‌లో మళ్లీ నోట్ల కట్టల దుమారం

- తృణమూల్ ఎమ్మెల్యే ఇంట్లో రూ.11 కోట్ల నగదు
- ఐటి శాఖ సోదాల్లో వెలుగులోకి

**కొల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో నోట్ల కట్టలు మళ్లీ దుమారం రేపాయి. అధికార తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన జాకీర్ హుస్సేన్ ఇళ్లు, ఫ్యాక్టరీలపై ఆదాయపు పన్ను శాఖ బుధ, గురువారాల్లో చేపట్టిన సోదాల్లో రూ.11 కోట్ల పైగా నగదు పట్టుబడింది. బుధవారం ఉదయం నుంచి గురువారం తెల్లవారుజాము 3.30 గంటల వరకు కొల్‌కతా, ముర్షిదాబాద్‌లోని దాదాపు 20కి పైగా ప్రాంతాల్లో ఏకకాలంలో ఈ సోదాలు జరిగాయి. జాకీర్ ఇళ్లు, ఆయన బీడీ ఫ్యాక్టరీ, నూనె మిల్లు, రైస్‌మిల్లుల్లో జరిపిన సోదాల్లో భారీ మొత్తంలో నోట్ల కట్టలను ఐటీ అధికారులు గుర్తించారు. వీటి విలువ రూ.11కోట్లకు పైనే ఉంటుందని తెలిపారు. ముర్షిదాబాద్‌లోని మరో రెండు బీడీ తయారీ యూనిట్లలోనూ రూ.5.5 కోట్ల నగదును గుర్తించారు. ఈ మొత్తం లెక్కల్లో చూపించిన ఆదాయమా లేదా అన్నదానిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఈ దాడులపై జాకీర్ స్పందించారు. ఆ డబ్బుకు తనవద్ద అన్ని పత్రాలు ఉన్నాయని తెలిపారు. తన ఫ్యాక్టరీలు, మిల్లుల్లో 7వేల మంది కూలీలు పనిచేస్తున్నారని, వారికి జీతం ఇచ్చేందుకే ఈ నగదును ఉంచినట్లు పేర్కొన్నారు. గతేడాది తృణమూల్ నేత పార్థా ఛటర్జీ సన్నిహితురాలు అర్పితా ముఖర్జీకి చెందిన నివాసాల్లో పెద్ద ఎత్తున నోట్ల గుట్టలు బయటపడిన ఘటన బెంగాల్ రాజకీయాల్లో కలకలం సష్టించిన విషయం తెలిసిందే.

## చైనా సరిహద్దుల్లో పరిస్థితి అదుపులోనే ఉంది : ఆర్మీ చీఫ్

**న్యూఢిల్లీ :** చైనాతో ఉత్తర సరిహద్దుల్లో పరిస్థితి అదుపులోనే ఉందని.. ఎలాంటి సమస్యలనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని ఆర్మీ చీఫ్ మనోజ్ పాండే పేర్కొన్నారు. సరిహద్దు నియంత్రణ రేఖ (ఎల్‌ఎసి)ని మార్చేందుకు ప్రయత్నించిన అన్ని చర్యలను భారత ఆర్మీ తిప్పికొట్టిందని అన్నారు. ఆర్మీ డే సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఉత్తర సరిహద్దు వద్ద పరిస్థితి స్థిరంగా, నియంత్రణలో ఉందని అన్నారు. ఏడు సమస్యల్లో ఐదింటిని పరిష్కరించగలిగామని చెప్పారు. పాక్ సరిహద్దులో కాల్పుల విరమణ కొనసాగుతోందని,. ఉగ్రవాద కార్యకలాపాలు, మౌలిక సదుపాలకు పాకిస్తాన్ మద్దతు ఇప్పటికీ కొసాగుతుందని అన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో చాలా ప్రాంతాల్లో శాంతినెలకొందని అన్నారు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అయినందుకు ఈ సారి ఆర్మీడే చాలా ప్రాముఖ్యతను సంతరించుకుందని అన్నారు.

## గౌరవం తగ్గకుండా పొత్తు

**మొదటి పేజీ తరువాయి**

కళాశాలలో చదువుతూ అనుమానస్పదంగా మృతి చెందిన వజ్రపుకొత్తూరు మండలానికి నగేష్ కుటుంబానికి రూ.2లక్షలు రూపాయాలతో పాటు జనసేన తరుపున న్యాయ సాయమందించనున్నట్లు ప్రకటించారు విజయనగరం జిల్లాలో మొబైల్ లైబ్రరీ నడుపుతున్న రెడ్డి రమణకు రూ.2 లక్షల ఆర్థిక సాయమందించారు. అదేవిధంగా మత్స్యకార యువత కోసం శిక్షణా కేంద్రం నడుపుతున్న కె రాజశేఖర్‌కు రూ.2 లక్షలు ఆర్థిక సాయమందించారు. సభలో జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

**విశాఖ ఉక్కు బ్యానర్ ప్రదర్శన**

సభా ప్రాంగణంలో విశాఖపట్నానికి చెందిన స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి ఈశ్వరరావు ఆధ్వర్యాన వచ్చిన 200 మంది యువకులు విశాఖ ఉక్కు... ఆంధ్రుల హక్కు బ్యానర్‌ను ప్రదర్శించారు.

**గుండెపోటులో వ్యక్తి మృతి**

యువశక్తి సభకు వచ్చిన విశాఖపట్నానికి చెందిన వానపల్లి రంగారావు (70) అనే వ్యక్తి గుండె పోటుతో మరణించారు. సభలోకి వచ్చిన ఆయన గ్యాలరీలో కూర్చొన్న కొద్ది సేపటికే కుప్పకూలిపోయారు.

# రాజ్యాంగ హద్దుల్లో పరస్పర గౌరవం

- అఖిల భారత ప్రిసైడింగ్ అధికారుల సమావేశం తీర్మానం
- ముగిసిన 83వ సమావేశం



**జైపూర్ :** రాజ్యాంగం నిర్దేశిస్తున్న హద్దుల్లో పని చేసుకుంటూ న్యాయ వ్యవస్థ, శాసన వ్యవస్థ పరస్పరం గౌరవించుకోవాలని 83వ అఖిల భారత ప్రిసైడింగ్ అధికారుల సమావేశం ఏకగ్రీవంగా ఒక తీర్మానం చేసింది. బుధ, గురువారాల్లో జరిగిన ఈ సమావేశాలు ఘనంగా ముగిశాయి. రాజ్యాంగంపై ఉపరాష్ట్రపతి వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ప్రిసైడింగ్ అధికారులు ఈ తీర్మానం చేయడం గమనార్హం. న్యాయ వ్యవస్థకు, చట్టసభకు వేర్వేరుగా గల ప్రత్యేక అధికారాలను గుర్తించాలనీ, రాజ్యాంగం కల్పించిన హద్దులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు.

దేశ చట్టసభల ద్వారా చట్టాలను రూపొందించడంలో భారత ప్రజల ప్రాధాన్యతపై తన సంపూర్ణ విశ్వాసాన్ని పునరుద్ఘాటిస్తూ ఈ సమావేశంలో తీర్మానించారు. భారత రాజ్యాంగంలో నిర్దేశించిన రాజ్యాంగ సరిహద్దులను ప్రభుత్వ వ్యవస్థలోని అన్ని విభాగాలు గౌరవించాలని ఉద్బోధించింది. అయితే బిజెపి నేతలు, ఆ పార్టీ సైద్ధాంతిక మూలాలున్న గవర్నర్లు వంటి రాజ్యాంగ పదవులు నిర్వహిస్తున్న వారి తీరు పలు వివాదాలు రాజేస్తున్న సంగతి తెలిసిందే. 'చట్టసభ అత్యుత్తమమైనది. చట్టాలను చేసే హక్కు దానికి వుంది కాబట్టి చట్టాలను రూపొందిస్తుంది. అన్ని సంస్థలు వాటి హద్దుల పరిధిలోనే వుండాలని భావిస్తుంది.' అని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా వ్యాఖ్యానించారు. సమావేశం ముగిసిన తర్వాత ఆయన విలేకర్లతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా రాష్ట్రాల శాసనసభలు, శాసన మండలుల ప్రిసైడింగ్ అధికారుల సమావేశం బుధవారం ఇక్కడ ప్రారంభమైంది. ఆ సమావేశాలను ప్రారంభిస్తూ ఉప రాష్ట్రపతి ధన్‌కర్, న్యాయ వ్యవస్థ వైఖరిపై లేదా ఆధిపత్యంపై వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీలు, శాసన మండళ్ళు, పార్లమెంట్‌లో సభ్యుల వ్యవహార శైలిపై నిబంధనావళిని రూపొందించాలని తీర్మానం కోరింది. సభల్లో పార్లమెంట్‌యేతర వ్యవహార శైలిని అడ్డుకోవడానికి నిబంధనలను రూపొందించి, సమర్ధవంతంగా అమల్లోకి తేవాలని తీర్మానం కోరింది. చట్టసభల వ్యవహారాలకు సంబంధించిన నిబంధనావళిని కూడా సమగ్రంగా సమీక్షించాలని కోరింది. సభ్యులు మరింత మంది పాల్గొనేలా, చట్టసభలు మరింత సమర్ధవంతంగా పనిచేసేలా అత్యుత్తమ విధానాలను, పద్ధతులను పొందుపరుస్తూ నమూనా నిబంధనలను రూపొందించాలని కోరింది. జి-20 అధ్యక్ష పదవిని భారత్ చేపట్టిన నేపథ్యంలో భారతదేశాన్ని ప్రజాస్వామ్యానికి మాతృకగా అభివర్ణించడానికి పూర్తి మద్దతును ప్రకటించింది. చట్టసభల్లో ముఖ్యంగా ప్రశ్నోత్తరాల సమయంలో ఎలాంటి అంతరాయాలు ఎదురవకుండా రాజకీయ పార్టీలు తమ మధ్య ఏకాభిప్రాయాన్ని కుదుర్చుకోవాలని తీర్మానం కోరింది.

తీర్మానాన్ని ఆమోదించిన తర్వాత సమావేశంలో ముగింపు ఉపన్యాసం చేస్తూ రాజస్థాన్ గవర్నర్ కల్‌రాజ్ మిశ్రా, సభలో సభ్యులకు క్రమశిక్షణ, వ్యవహార శైలి అత్యంత అవసరమని అన్నారు. సభ్యుల గందరగోళం మధ్య బిల్లులను ఆమోదించడం సరైన పద్ధతి కాదన్నారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ అంతకుముందు మాట్లాడుతూ, తమ ప్రభుత్వం తీసుకువచ్చిన ఆరోగ్య హక్కు, సామాజిక భద్రతా హక్కు నమూనాలో కేంద్రం కూడా హక్కుల ఆధారిత చట్టాలను తీసుకురావాలని కేంద్రాన్ని కోరారు.

# గుడికి కట్టి.. రాత్రంతా కొట్టి

- దళితుడిపై పెత్తందారీ కులస్థుల దారుణ చర్య
- మండుతున్న కర్రతో దెబ్బలు.. చిత్ర హింసలు
- స్పృహ కోల్పోయిన బాధితుడు.. అరెస్టు కాని నిందితులు
- ఉత్తరకాశీలో ఘటన



**డెహ్రాడూన్ :** బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాల ఉదాసీన వైఖరి కారణంగా దళితులపై పెత్తందారీ కులస్థుల దాడులు నిత్యకృత్యమయ్యాయి. దళితులను కనీసం గుడులకూ రానివ్వటం లేదు. కాదని వస్తే భౌతిక దాడులకు దిగుతూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకొని బాధితులకు భరోసా కల్పించాల్సిన కాషాయ ప్రభుత్వాలు ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నాయి. ఇలాంటి ఘటనే ఇటీవల ఉత్తరాఖండ్‌లో చోటు చేసుకున్నది. దళితుడిపై ఐదుగురు పెత్తందారీ కులస్థులు దాడి చేసిన ఘటన ఉత్తర కాశీలో చోటు చేసుకున్నది. బాధితుడిని ఐదుగురు నిందితులు గుడిలో బంధించారు. గుడికి కట్టేసి రాత్రంతా మండుతున్న కర్రతో తీవ్రంగా కొట్టారు. ఈ దెబ్బలకు తట్టుకోలేకపోయిన బాధితుడు స్పృహ తప్పి పడిపోయాడు. అయితే, నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. నిందితులపై కేసుల నమోదు చేసిన పోలీసులు.. వారి కోసం గాలిస్తున్నట్టు చెప్పారు. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. బానోల్ గ్రామానికి చెందిన బాధితుడు ఆయూష్ (22) ఈనెల 9న రాత్రి ఏడు గంటలకు గ్రామంలోని కౌన్వల్ గుడికి వెళ్లాడు. పూజలు చేసి మొక్కులు సమర్పించుకున్నాడు. అయితే, అప్పటికే గుడిలో ఉన్న కొందరు ఆయూష్‌పై అకస్మాత్తుగా దాడికి దిగారు. వారు బాధితుడిని గుడిలో కట్టేశారు. గ్రామంలోని ఐదుగురు పెత్తందారీ కులస్థులు ఆయూష్‌ను రాత్రంతా మండుతున్న కర్రతో తీవ్రంగా కొట్టారు. దీంతో బాధితుడు స్పృహతప్పి పడిపోయాడు. తర్వాత రోజు ఉదయం స్పృహలోకి వచ్చిన ఆయూష్ తాను నగ్నంగా ఉన్నట్టు తెలిపాడు. అనంతరం అక్కడి నుంచి ఎలాగోలా తప్పించుకొని ఇంటికి చేరుకున్నాడు. దాడికి సంబంధించిన గుర్తులు, గాయాలు ఆయుష్ శరీరంపై ఉన్నాయి. అనంతరం మోరీ పోలీసు స్టేషన్‌కు వెళ్లి బాధితుడు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు అందుకున్న పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంతో పాటు పలు సెక్షన్ల కింద నిందితులపై కేసులు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేయడానికి వారి ఇండ్లు, రహస్య స్థావరాలలో గాలిస్తున్నామని ఉత్తరకాశీ ఎస్పీ అర్పన్ యదువంశీ తెలిపారు. నిందితులు అరెస్టు అయిన తర్వాతే ఈ ఘటన వెనుక గల కారణం బయటకు వస్తుందని చెప్పారు.

# న్యూయార్క్ సిటీలో నర్సుల సమ్మె




**న్యూయార్క్ :** న్యూయార్క్ సిటీలో వరుసగా మూడోరోజూ నర్సులు సమ్మె కొనసాగింది. బుధవారం ఉదయం మౌంట్‌సినాయ్ హాస్పిటల్ ఎదుట వందలాది మంది నర్సులు ఎర్రరంగు టోపీలతో నిరసన చేపట్టారు. సిబ్బంది కొరతను తీర్చాలని, మెరుగైన వేతనం కోసం మౌంట్ సినాయ్ హాస్పిటల్, మాంటెఫియోర్ బ్రోంక్స్ ఆస్పత్రులకు చెందిన వేలాది మంది నర్సులు గత రెండు రోజులుగా సమ్మె చేపడుతున్నారు. 99 శాతం మంది ఈ సమ్మెకు ఆమోదం తెలిపారని మౌంట్ సినాయ్ హాస్పిటల్‌కి చెందిన నర్సు మిన్నా స్కాట్ పేర్కొన్నారు.

మౌంట్ సినాయ్ ప్రైవేట్ ఆస్పత్రి కావడంతో న్యూయార్క్ కార్మిక చట్టాలను పాటించాల్సిన అవసరం లేదని భావిస్తోందని అన్నారు. ప్రస్తుతం 500కిపైగా ఖాళీలు ఉన్నాయని, సిబ్బంది కొరత కారణంగా నర్సులు ఓవర్‌టైం పనిచేయాల్సి వస్తోందని స్కాట్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అసురక్షిత ప్రదేశాల్లో పనిచేయలేక ప్రతి రోజూ ముగ్గురు నర్సులు రాజీనామా చేసి వెళుతున్నారని అన్నారు. నర్సులకు తగిన వేతనాలు అందడం లేదని చెప్పారు. ఇంటర్నల్ రెవెన్యూ సర్వీస్ ప్రకారం.. ఈ ఆస్పత్రి చైర్మన్ ఏడాదికి 12,437,000 డాలర్లు సంపాదిస్తారని, దీంతో నర్సులకు మెరుగైన వేతనం ఇవ్వచ్చని అన్నారు. రెండు ఆస్పత్రుల నుండి 7వేల మంది నర్సులు సమ్మెలో చేరారని అన్నారు.

## ఆ దగ్గు సిరప్‌లను ఉపయోగించొద్దు : డబ్ల్యుహెచ్‌ఒ

**జెనీవా :** నోయిడాకు చెందిన మారియన్ బయోటెక్ కంపెనీ తయారు చేసిన రెండు దగ్గు సిరప్‌లను ఉజ్బెకిస్థాన్‌లోని పిల్లలకు ఉపయోగించరాదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఒ) సిఫార్సు చేసింది. మారియన్ బయోటెక్ తయారు చేసిన వైద్య ఉత్పత్తులు నాణ్యతా ప్రమాణాలను స్పెసిఫికేషన్‌లను అందుకోవడంలో విఫలమయ్యాయని.. అందువల్లే వాటిని ఉపయోగించొద్దని బుధవారం డబ్ల్యుహెచ్‌ఒ ఒక హెచ్చరిక జారీ చేసింది.

ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాకు చెందిన మారియన్ బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ తయారు చేసిన రెండు సిరప్‌లు ఆంబ్రోనాల్ డాక్-1 మాక్స్ సిరప్‌ల తయారీ నాణ్యత ప్రమాణాలు పాటించలేదని డబ్ల్యుహెచ్‌ఒ పేర్కొంది. దగ్గు సిరప్ తాగి పిల్లలు చనిపోయారనే నివేదికలు వెలువడటంతో నోయిడాకు చెందిన ఫార్మా మారియన్ బయోటెక్ క్లౌడ్ కిందకు వచ్చింది.

డబ్ల్యుహెచ్‌ఒ ప్రకారం.. ఉజ్బెకిస్తాన్ రిపబ్లిక్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ జాతీయ నాణ్యత నియంత్రణ ప్రయోగశాలలు నిర్వహించిన నాణ్య పరీక్షల్లో రెండు ఉత్పత్తుల్లో ఆమోదయోగ్యం కాని మొత్తంలో డైథిలీన్ గ్లైకాల్ లేదా ఇథిలీన్ గ్లైకాల్ కలుషితాలు ఉన్నట్లు కనుగొనబడింది. అవి అనధికారిక మార్కెట్ల ద్వారా ఇతర దేశాలు లేదా ప్రాంతాలకు కూడా పంపిణీ చేయబడి ఉండవచ్చు అని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. నాసిరకం ఉత్పత్తులు సురక్షితం కాదని.. వాటి ఉపయోగం, ముఖ్యంగా పిల్లలలో, తీవ్రమైన గాయం లేదా మరణానికి దారితీయవచ్చని డబ్ల్యుహెచ్‌ఒ హెచ్చరికలు జారీ చేసింది. డిసెంబరు 22న ఉజ్బెకిస్థాన్‌లో మారియన్ బయోటెక్ కంపెనీ తయారుచేసిన మందులు తాగి 18 మంది పిల్లలు చనిపోయారని తెలిపింది.

ఉజ్బెకిస్థాన్‌లో 18 మంది చిన్నారుల మరణానికి కారణమైన మారియన్ బయోటెక్ కంపెనీ ఉత్పత్తి లైసెన్స్‌ను ఉత్తరప్రదేశ్ ఫుడ్ సేఫ్టీ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ మంగళవారం సస్పెండ్ చేసింది. దగ్గు సిరప్ డాక్1 మ్యాక్స్ కలుషితమైందన్న నివేదికల దృష్ట్యా నోయిడాకు చెందిన ఫార్మా కంపెనీ తయారీ కార్యకలాపాలన్నింటినీ నిలిపివేసినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రి మన్‌సుఖ్ మాండవియా గత నెలలో తెలిపారు.

## జూలియాకా ఊచకోత బాధితులకు వందలాది మంది నివాళి

**లిమా :** జులియాకా వీధుల నిండా వందలాది మంది బాధితుల శవపేటికలతో బుధవారం భారీ ప్రదర్శన చేపట్టారు. జనవరి 9, 10 తేదీల్లో చేపట్టిన నిరసనల్లో మరణించిన వారికి జులియాకాలోని ప్రధాన కూడలిలో నివాళులర్పించారు. ఆగ్నేయ పెరూలోని జులియాకా విమానాశ్రయం సమీపంలో సోమవారం జరిగిన ఘర్షణల్లో సుమారు 17 మంది మరణించిన సంగతి తెలిసిందే. మరణించిన వారిలో ఇద్దరు యువకులు ఉన్నారు. తమకు న్యాయం చేయాలని బాధితుల కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు. పెరూ అధ్యక్షురాలు డినా బోలువార్టే రాజీనామా చేయాలంటూ ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు. మాజీ అధ్యక్షుడు పెడ్రో కాస్టిల్లో అరెస్ట్ అనంతరం గతేడాది డిసెంబర్ నుండి దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. నిరసనలు ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటివరకు 46 మంది మరణించారు.

## ఉక్రెయిన్‌లో రష్యా మిలటరీ దళాలకు కొత్త కమాండర్

**మాస్కో :** ఉక్రెయిన్‌లో రష్యా దళాలకు కొత్త మిలటరీ కమాండర్‌ను రష్యా నియమించింది. రష్యా సాయుధ దళాల జనరల్ స్టాఫ్ చీఫ్ వాలెరీ గెరాసిమోవ్ ఉక్రెయిన్‌లోని రష్యా సమీకృత దళాలకు కొత్త కమాండర్‌గా నియమితులైనట్లు రక్షణ మంత్రిత్వ శాఖ బుధవారం ప్రకటించింది. మాజీ మిలటరీ కమాండర్ సెర్గీ సురోవికిన్‌తో పాటు గ్రౌండ్ ఫోర్సెస్ కమాండర్ ఇన్ చీఫ్ ఒలేగ్ మరియు డిప్యూటీ చీఫ్ ఆఫ్ జనరల్ స్టాఫ్ అలెక్సీ కిమ్‌లు గెరాసివ్ డిప్యూటీలుగా నియమితులైనట్లు రక్షణ మంత్రిత్వ శాఖ ఆ ప్రకటనలో పేర్కొంది. ప్రత్యేక సైనిక ఆపరేషన్‌లో భాగంగా విస్తృత చర్యలు చేపట్టేందుకు ఈ నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

## హిడ్మా సురక్షితం

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో పోలీసులు జరిపిన కాల్పుల్లో మావోయిస్టు అగ్రనేత మడావి హిడ్మ మరణించినట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని మావోయిస్టు పార్టీ బస్తర్ డివిజన్ కమిటీ ప్రకటించింది. ఈమేరకు గురువారం ఆ డివిజన్ కార్యదర్శి గంగా పేరుతో ఓ లేఖ విడుదలైంది. హిడ్మా సురక్షితం గానే ఉన్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. "దక్షిణ బస్తర్ అటవీ ప్రాంతంలోని కొండలపై పోలీసులు, సిఆర్‌పిఎఫ్ బలగాలు డ్రోన్‌లు, హెలికాప్టర్లతో దాడులు చేశారు. గత ఏడాది ఏప్రిల్‌లోనూ బస్తర్ ప్రాంతంలో వైమానిక బాంబు దాడి జరిగింది. మావోయిస్ట్ పార్టీ నాయకత్వం, పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీని దెబ్బతీయాలని వందల సంఖ్యలో బాంబులు పేల్చారు. రాత్రీ పగలు తేడా లేకుండా హెలికాప్టర్ల ద్వారా నిఘా పెట్టారు. వచ్చే ఎన్నికలలోపు మావోయిస్టులను ఏరివేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రకటించిన నేపథ్యంలోనే మాపై ఈ దాడులు జరుగుతు న్నాయి. ఈ భీకర దాడుల కారణంగా ప్రజలు పొలాలకు వెళ్లలేకపోతున్నారు. అని లేఖలో పేర్కొన్నారు.

## మరోసారి హెల్త్ ఎమర్జెన్సీని పొడిగించిన అమెరికా

**వాషింగ్టన్ :** కరోనా మహమ్మారి కోసం పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీని అమెరికా మరోసారి పొడిగించింది. హెల్త్ ఎమర్జెన్సీని పునరుద్ధరించినట్లు అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెల్త్ అండ్ హ్యూమన్ సర్వీసెస్ (హెచ్‌హెచ్‌ఎస్) బుధవారం ప్రకటించింది. ఒమిక్రాన్ సబ్ వేరియంట్ ఎక్స్‌బిబి.1.5 ప్రధానంగా ఈశాన్య అమెరికాలో వ్యాపిస్తోంది. ఇక్కడ ఇది 70 శాతం కంటే ఎక్కువ కేసులు ఉండగా.. దేశవ్యాప్తంగా 28 శాతంగా ఉన్నట్లు హెచ్‌హెచ్‌ఎస్ తెలిపింది. ప్రజారోగ్యరిత్యా వైద్య ఉన్నతాధికారులతో సంప్రదించి హెల్త్ ఎమర్జెన్సీ పొడిగింపును పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకున్నట్లు హెచ్‌హెచ్‌ఎస్ సెక్రటరీ జేవియర్ బెకెర్రా తెలిపారు. దీంతో ప్రజలకు కరోనా పరీక్షలు నిర్వహించడం, వ్యాక్సిన్లు వేయడం, చికిత్సను కొనసాగించడానికి అనుమతిస్తుందని అన్నారు. 2020 జనవరిలో కరోనా మహమ్మారి ప్రారంభమైనపుడు మొదటిసారి అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. అప్పటినుండి మూడు నెలలకొకసారి పునరుద్ధరిస్తున్నారు.

## రాజ్యాంగమే సర్వోన్నతం

- ఉపరాష్ట్రపతి వ్యాఖ్యలు సరికాదు : ఏచూరి

**న్యూఢిల్లీ :** భారత రాజ్యాంగమే అన్నిటికీ సర్వోన్నతమైనదని సిపిఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి పేర్కొన్నారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన వ్యక్తి అదే రాజ్యాంగ ప్రాథమిక సూత్రాలనే సవాలు చేయడం ఉపరాష్ట్రపతి కార్యాలయానికి తగదని ఆయన హితవు పలికారు. అఖిల భారత ప్రిసైడింగ్ ఆఫీసర్స్ సమావేశంలో ఉపరాష్ట్రపతి జగదీష్ ధనకర్ మాట్లాడుతూ పార్లమెంటే సర్వోన్నతమైనదంటూ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో సామాజిక మాధ్యమాల్లో సీతారాం ఏచూరి తన అభిప్రాయాన్ని పోస్టు చేశారు. భారత రాజ్యాంగమే పార్లమెంటును ఏర్పాటు చేసిందని ఆయన గుర్తు చేశారు. కార్యానిర్వాహక విభాగం (ప్రభుత్వం), శాసన వ్యవస్థ, న్యాయవ్యవస్థ ఇలా అన్ని విభాగాలూ తమ అధికారాలను, విధులను రాజ్యాంగం ద్వారానే పొందాయని తెలిపారు. అంతే కానీ వాటికి ఇంకెక్కడి నుంచో అధికారాలు దఖలు పడలేదన్నారు. రాజ్యాంగమే సర్వోన్నతమైనదని ఆయన స్పష్టం చేశారు. సంఖ్యా బలం ఉన్నంత మాత్రన ఏ ప్రభుత్వం కూడా మన గణతంత్ర వ్యవస్థలోని ఈ ప్రాథమిక నిర్మాణాన్ని తక్కువ చేయజాలవని ఏచూరి పేర్కొన్నారు. ఇలాంటి ఘటనల నుంచి మనల్ని కాపాడుతూ వస్తున్నది ఈ 'ప్రాథమిక నిర్మాణ సూత్రమే'నని తెలిపారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి బాధ్యతలు చేపట్టిన గౌరవనీయులైన ఉపరాష్ట్రపతి ఇప్పుడు అదే రాజ్యాంగ 'సర్వోన్నత'ను ప్రశ్నించేలా వ్యాఖ్యలు చేయడం భావి తరాలకు తప్పుడు సంకేతాలను ఇస్తుందని ఏచూరి అన్నారు. భారత సార్వభౌమాధికారాన్ని కూడా రాజ్యాంగం ప్రజలకే అప్పగించిందని తెలిపారు. అందుకనే మన రాజ్యాంగం 'భారత ప్రజలమైన మేము..' అని ప్రారంభమౌతుందని ఆయన గుర్తు చేశారు. ఈ సర్వోన్నతమైన అధికారాన్ని 'రాజ్యం'లోని ఏ విభాగమూ భర్తీ చేయలేదని ఏచూరి పేర్కొన్నారు. ఐదేళ్లకు ఒకసారి తమ ప్రతినిధులను తాత్కాలికంగా ఎన్నుకునేందుకు ప్రజలు తమకు లభించిన ఈ సార్వభౌమాధికారాన్ని వినియోగిస్తారని తెలిపారు. శాసనకర్తలు తమకుతాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంటారని తెలిపారు. కార్యానిర్వాహక వ్యవస్థ ( ప్రభుత్వం) శాసన వ్యవస్థ (పార్లమెంటు)కు జవాబుదారీ వహించాల్సివుంటుందని, ఎంపీలు ప్రజలకు జావాబుదారీవహించాల్సిందేనని తెలిపారు. ఈ మొత్తం రాజ్యాంగ నిర్మాణ క్రమంలో ఎక్కడ కూడా ప్రజల సార్వభౌమాధికారాన్ని భర్తీ చేసే వ్యవస్థ మరొకటి లేదని ఏచూరి స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో భారత గణతంత్ర, లౌకిక, ప్రజాతంత్ర లక్షణాన్ని ధ్వంసం చేసి ఆ స్థానంలో అసహన ఫాసిస్టు హిందూత్వ రాష్ట్ర ఏర్పాటుకు జరుగుతున్న ఈ కుట్రలను అడ్డుకొని వాటిని తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు.



## ఒపిఎస్ అమల్జేయాలి

- రైల్వే యూనియన్ల ఆందోళన

**బెంగళూరు :** జాతీయ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పిఎస్)ను రద్దు చేసి, దాని స్థానంలో పాత పెన్షన్ పథకాన్ని (ఒపిఎస్) పునరుద్ధరించాలని ఆందోళన చేపట్టారు. సౌత్ వెస్టర్న్ రైల్వే మజ్దూర్ యూనియన్ (ఎస్‌డబ్ల్యుఆర్‌ఎంయు) నేతృత్వంతో జరిగిన ఈ ఆందోళనలో ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 2004 జనవరి 1 తర్వాత జాయిన్ అయిన ఉద్యోగులందరికీ ఎన్‌పిఎస్ అమల్జేస్తుండటంపై పలు రాష్ట్రాల్లో ఆందోళనలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే.

## మోడీ పర్యటనలో భద్రతా లోపం



**న్యూఢిల్లీ :** దేశంలోనే ఐదంచెలతో అత్యంత పటిష్టమైన భద్రతను కలిగి ఉండే భారత ప్రధాని మోడీ పర్యటనలో భద్రతా వైఫల్యం బయటపడింది. కర్నాటకలోని ఒక రోడ్‌షోలో ఎస్‌యూవీ రన్నింగ్ బోర్డుపై నిలబడి ప్రధాని ప్రజలకు అభివాదం చేస్తుండగా ఒక బాలుడు (11) ఆయన వైపు ఒక పూల మాలతో దూసుకొచ్చాడు. సెక్యూరిటీ జోన్‌లోకి ప్రవేశించి మరీ ప్రధానికి అతి దగ్గరగా వచ్చాడు. పూల మాలతో సత్కరించే ఉద్దేశంతోనే ఆ బాలుడు ప్రధాని వైపునకు వచ్చినట్టు తెలిసింది. అయితే, అప్రమత్తమైన ప్రధాని ప్రత్యే భద్రతా సిబ్బంది (ఎస్పీజీ) ఆ వ్యక్తిని నిరోధించింది. ఆ బాలుడిని అక్కడి నుంచి తీసుకెళ్లింది. అనంతరం ప్రధాని ప్రజలకు అభివాదం చేస్తూ తన రోడ్‌షోను కొనసాగించారు. 29 నేషనల్ యూత్ ఫెస్టివల్‌ను గురువారం సాయంత్రం ప్రారంభించడానికి ముందు ఆయన ఈ రోడ్ షోను చేపట్టారు. ఏయిర్‌పోర్టు నుంచి కార్యక్రమం జరిగే రైల్వే స్పోర్ట్స్ గ్రౌండ్ వరకు సాగిన ఈ రోడ్ షో లోనే భద్రతా వైఫల్యం బయట పడటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆ బాలుడు పటిష్ట భద్రతను దాటుకొని.. ప్రధానికి అంత దగ్గరకు ఎలా రాగలిగాడన్నది అధికారులకు అంతుచిక్కటం లేదు.

## ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్‌కు శాశ్వత చట్టం

**మొదటి పేజీ తరువాయి**

బౌద్ధ సంఘం కార్యదర్శి జి.నవీన్, దళిత, ఆదివాసీ జెఎసి కన్వీనర్ పతివాడ రాంబాబు, ఆర్‌పిఐ రాష్ట్ర కార్యదర్శి చిట్టిబాబు, మాజీ కార్పొరేటర్ కొప్పుల వెంకటరావు, భీంసేన రాష్ట్ర అధ్యక్షులు రవి సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

**డిమాండ్లు**

- ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టాన్ని శాశ్వతంగా అమలు చేయాలి. ప్రస్తుతం ఉన్న పేరును ఆంధ్రప్రదేశ్ ఎస్‌సి, ఎస్‌టి ప్రత్యేక అభివృద్ధి నిధి చట్టంగా మార్చాలి.
- ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఖర్చు కాకుండా మిగిలిపోయిన నిధులను మరుసటి సంవత్సరంలో కేటాయించిన బడ్జెట్‌కు అదనంగా కలిపి ఖర్చు చేయాలి.
- 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటి వరకూ సబ్ ప్లాన్ నిధుల వినియోగంపై సామాజిక తనిఖీ నిర్వహించాలి. దళిత గిరిజనుల్లో వచ్చిన అభివృద్ధిపై అధ్యయనం చేసి, శ్వేతపత్రం విడుదల చేయాలి.
- సబ్ ప్లాన్ బడ్జెట్ పర్యవేక్షణకు జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీలు బాధ్యతాయుతంగా పనిచేయాలి. ఈ కమిటీకి జిల్లాలోని ఎమ్మెల్యే, ఎంపి, ఎమ్మెల్సీల్లో ఒకరిని ఛైర్‌పర్సన్‌గా నియమించి స్థానిక దళిత, గిరిజన, పౌర సంఘాలు, ఎన్‌జిఒలను భాగస్వాములుగా చేయాలి.
- సబ్ ప్లాన్ అమలుకు ప్రత్యేక యంత్రాంగాన్ని నియమించాలి. సబ్‌ప్లాన్ ద్వారా అమలు చేస్తున్న పథకాల రూపకల్పనలో ఆయా తరగతుల ప్రజలను భాగస్వాములను చేయాలి.
- సబ్‌ప్లాన్ ద్వారా అమలు చేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాలపై ప్రజలకు పూర్తి స్థాయి అవగాహన కల్పించాలి.

## ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకు సమరయాత్ర

**మొదటి పేజీ తరువాయి**

హామీలపై ఇచ్చిన మాటను బిజెపి తప్పిందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కేంద్రప్రభుత్వం ఈ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని పార్టీల ఎజెండాలో ఈ అంశాలు ఉండాలని, దీనికోసం ఐక్య ఉద్యమం అవసరమని చెప్పారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి భజన చేయకుండా రాష్ట్ర ప్రయోజనాల కోసం పార్టీలు పోటీ పడాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ భవిష్యత్ తరాల కోసం నిర్వహిస్తున్న ఉద్యమం అని అన్నారు. రాష్ట్రానికి మోడీ నమ్మకద్రోహం చేస్తుంటే ముఖ్యమంత్రి మూడు రాజధానుల పేరుతో డైవర్షన్ పొలిటిక్స్ చేస్తూ రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నారని అన్నారు. బిజెపిది విష కౌగిలి అని, దీనిని వైసిపి, జనసేన గ్రహించాలని సూచించారు. ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు వీరవరప్రసాద్, నవతరం పార్టీ నాయకులు సుబ్రహ్మణ్యం, కాంగ్రెస్ పార్టీ నాయకులు వి గురునాథం, టిడిపి నాయకులు లింగమనేని శివరాం ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని కేంద్రం అడుగడుగునా అన్యాయం చేసిందని విమర్శించారు. అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు కె ప్రసన్న కుమార్, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్ర, పిడిఎస్‌యు జాతీయ నాయకులు రవిచంద్ర, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె శివారెడ్డి, ఎన్‌ఎస్‌యుఐ ప్రధాన కార్యదర్శి వి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## మీకోసం

ధనియాలు నోట్లో వేసుకొని చప్పరిస్తూ ఉంటే నోటి దుర్వాసన తగ్గుతుంది.

## జీవన సౌరభం

ఓ మంచి ఆలోచన లక్షలాదిమందిని కదిలిస్తుంది. లక్షలాది మందిలో కదలిక ఒక సమాజాన్ని మారుస్తుంది.





## పండుగ చేద్దాం... రారండి

రారండోయ్ ... రారండి
పండుగ చేద్దాం రారండి
సంక్రాంతి వచ్చింది
కొత్త కాంతి తెచ్చింది

పొద్దున్నే లేద్దాము
భోగిమంటలు వేద్దాము
తలంటు స్నానం చేద్దాము
అహాన్ని వదిలేద్దాము

గొబ్బిళ్ళు పెడదాము
తప్పట్లు తడదాము
పతంగులెగరేద్దాము


పిండివంటలు తిందాము
హరిదాసు కీర్తనలు విందాము
బసవన్న గారడీలు చూద్దాము
ముత్యాల ముగ్గులు గీద్దాము
అందరం సందడి చేద్దాము

రారండోయ్ ...రారండి
పండుగ చేద్దాం రారండి
సంక్రాంతి వచ్చింది
నవ కాంతిని తెచ్చింది

- కయ్యూరు బాలసుబ్రమణ్యం
94417 91239

## చుక్కలు కలపండి

చిన్నారులూ , ఇక్కడ అంకెలు, సంఖ్యల దగ్గర చుక్కలను ఒకదాని తర్వాత ఒకటి కలపండి. ఏ బొమ్మ వచ్చిందో చూడండి.



## నేను గీసిన బొమ్మ





ఎం.అభినవ్, యుకెజి, అరవింద హైస్కూలు, కుంచనపల్లి, గుంటూరు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

# బాధితులే రక్షకులుగా...

**ఏదేని సామాజిక అంశంపై అవగాహన కల్పించేందుకు కొంతమంది సైకిల్ యాత్ర, స్కూటర్ యాత్రలు చేస్తూ దేశం చుట్టేస్తుంటారు. సరదా కోసం మరికొంతమంది తిరుగుతుంటారు. కాని బీహార్ కథితోయ గ్రామంలో కొంతమంది యువకుల బృందం వారు ఉంటున్న గ్రామం దాని చుట్టుపక్కల గ్రామాల్లోనే రోజూ సైకిల్‌యాత్ర చేస్తోంది. దాదాపు మూడేళ్లుగా అదేపనిగా ఐదు గ్రామాల్లో వారంతా ఎందుకు తిరుగుతున్నారంటే.. ఆ ప్రాంతాన్ని పట్టి పీడిస్తున్న అతిపెద్ద సమస్య మానవ అక్రమ రవాణా, బాలకార్మిక వ్యవస్థపై గ్రామస్తులకు అవగాహన కల్పించేందుకు ఆ యువత నడుంబిగించారు. వారు కూడా ఆ దుర్వ్యవస్థకు బలైనవారే. తాము పడ్డ బాధలు ఆ గ్రామాల్లో ఇంకే పిల్లలూ పడకూడదన్న దృఢసంకల్పంతో సమాజాన్ని చైతన్యం చేస్తున్న ఇటువంటి యువతే నేటి సమాజానికి అవసరం.**



షాబాజ్ బాల్యంలోనే మానవ అక్రమ రవాణాకు గురయ్యాడు. శ్రమ, దోపిడీ, తీవ్ర భయాందోళనల మధ్య దుర్భర జీవితం అనుభవించాడు. ఢిల్లీలోని ఓ దారం మిల్లులో రోజుకు 17 గంటలు పనిచేసేవాడు. వ్యవసాయ కూలీగా పని చేసే అతని తండ్రి ఏడుగురు సభ్యులున్న తన కుటుంబాన్ని పోషించేందుకు ఎన్నో ఇబ్బందులు పడేవాడు. చాలీచాలని జీతంతో కుటుంబ పోషణ దుర్భరమై కొడుకును పనిలో పెట్టాడు. వర్షాకాలం వచ్చిందంటే చాలు నదీతీర ప్రాంతాలైన కథితోయ, ఇమ్మానగర్ గ్రామాల ఇళ్ల, పొలాలన్నీ నీటమునిగి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. చాలా కుటుంబాలు కట్టుబట్టలతో మిగిలిపోతాయి. వారి దైనందిన స్థితి మానవ అక్రమ రవాణాదారులకు (ట్రాఫికర్లకు) అనువుగా మారుతుంది. అలా షాబాజ్ ట్రాఫికింగ్‌కు గురయ్యాడు. 'ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న మా నాన్నకు ఆ సమయంలో మరో గత్యంతరం లేదు. ట్రాఫికర్ చెప్పిన మాటలకు బాగా ప్రభావితమయ్యాడు. ఢిల్లీ దారం ఫ్యాక్టరీలో పిల్లాడిని పనికి పంపిస్తే ఆదాయంతో బాటు ఓ మంచి ఉపాధి దొరుకుతుందని భావించాడు. అప్పుడు నా వయసు 13 ఏళ్లు. ఇలా నా వయసు అంతకంటే తక్కువ వయసు పిల్లలు కూడా మా ప్రాంతాల్లో పని కోసం సుదూర ప్రాంతాలకు తరలిపోతారు' అంటూ ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నాడు షాబాజ్.

ఢిల్లీకి చేరిన షాబాజ్ ట్రాఫికర్ చెప్పిన మాటలకు పొంతన లేని జీవితం గడిపాడు. దుస్తులకు ఎంబ్రాయిడరీ చేసే పనికి కుదిరిన అతనికి నెలకు రూ.3000 ఆదాయం వచ్చేది. భోజనం మానేసి మరీ పని చేసిన అనుభవం ఉంది. 'చాలా సార్లు నేను భోజనం మానేసేవాడిని. విరామం తీసుకుంటే పని గంటల్లో కోత పడుతుందని అలా చేసేవాడిని' అంటున్న షాబాజ్ 2018లో 'బచపన్ బచావో ఆందోళన్' చొరవతో బాల కార్మిక చెర నుంచి బయటపడ్డాడు. కైలాష్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్(కెఎస్‌సిఎఫ్) స్వచ్ఛంద సంస్థకు చెందిన ఈ వింగ్ తరపున 30 మంది యువత బిహార్ గ్రామాల్లో సంచరిస్తూ కనిపించకుండా పోతున్న పిల్లల ఆచూకీ రాబట్టి వారిని రక్షిస్తుంది. అలా షాబాజ్‌కు విముక్తి లభించింది. ఇప్పుడు షాబాజ్ 9వ తరగతి చదువుతున్నాడు. 'పిల్లలందరూ నాణ్యమైన విద్యను చదవాలి. అలాగే వారి బాల్యాన్ని ఆస్వాదించాల'ని కలలుగంటున్నాడు.

**ముక్తి కారవాన్..**

లాక్‌డౌన్ కాలంలో చిన్న చిన్న ఫ్యాక్టరీల్లో, హోటల్లో పనిచేసే వందలాది పిల్లలు నగరాల నుండి గ్రామాలకు చేరుకున్నారు. అప్పుడే సెప్టెంబరు 2020న కైలాష్ ఫౌండేషన్ 'ముక్తి కారవాన్' పేరుతో ఓ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. లాక్‌డౌన్ తరువాత ఆ పిల్లలు తిరిగి పనుల్లోకి వెళ్లకుండా బడి బాట పట్టేలా.. మానవ అక్రమ రవాణా వ్యతిరేక ప్రచారానికి వారినే ఉపయోగించుకోవాలనుకున్నారు. అలా



బాధితులతోనే ఈ కార్యక్రమాన్ని ముందుకు నడిపిస్తున్నారు. ఆ బృందంలోనే పనిచేస్తున్నాడు షాబాజ్. గ్రామాలు తిరిగి ప్రచారం చేస్తున్నందుకు సీనియార్టిని బట్టి నెలకు రూ.9 వేల నుంచి రూ.13 వేల వరకు ఆదాయం వచ్చేలా ఫౌండేషన్ ప్రణాళికలు సిద్ధం చేసింది.


పేదరిక కుటుంబాల్లో చిన్న పిల్లలు కూడా ఆదాయ వనరులుగా పరిగణించడం సర్వసాధారణమైన విషయం అటువంటి చోట




తాము పడ్డ కష్టాలు, బాధలను ఆ తల్లిదండ్రులకు వివరించి వారి పిల్లలను అటువైపు వెళ్లకుండా చేయడంలో ఈ బాధిత బృందం శక్తి వంచన లేకుండా కృషి చేస్తోంది. గతుకుల రోడ్డులో సైక్లింగ్ చేయడం చాలా కష్టం. పైగా పిల్లలను పనుల్లోకి పంపించకుండా తల్లిదండ్రులను ఒప్పించడం మరింత కష్టం. అయినా ఆ బృందం అక్రమ రవాణాతో పాటు లాక్‌డౌన్ కాలంలో విపరీతంగా పెరిగిన బాల్యవివాహాలను అరికట్టడంలో కూడా చురుకుగా పనిచేస్తోంది. 'బాల్య వివాహాన్ని అడ్డుకున్నందుకు నాపై దాడి చేశారు. తీవ్రంగా గాయాలయ్యాయి. అయినా నేను వెనుకడుగు వేయలేదు' అంటున్నాడు సరీఫుల్ అనే ప్రచారకర్త.

సోషల్ మీడియాలో ఓ గ్రూపు క్రియేట్ చేసుకుని గ్రామాలలో కనిపించకుండా పోయిన పిల్లల ఆచూకి తెలుసుకుని పోలీసుల సాయంతో రక్షిస్తున్నారు. అలాగే గ్రామాల నుంచి వెళ్లిపోతున్న పిల్లల సమాచారం అందినప్పుడు ఫ్యాక్టరీలు అధికంగా ఉండే రాజస్థాన్, ముంబయి, ఢిల్లీ వంటి ప్రాంతాలకు వెళ్లే రైళ్లను తనిఖీలు చేస్తున్నారు. ఈ రకమైన కార్యక్రమం బీహార్ వ్యాప్తంగా 12 జిల్లాల్లో కొనసాగుతోంది. ఈ రెండేళ్లలో సుమారు 323 మంది పిల్లలను అక్రమ రవాణా బారి నుండి రక్షించారు. సమస్య నుండి రక్షించబడ్డామని ప్రశాంతంగా కూర్చోకుండా అసలా సమస్య ఏర్పడకుండా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్న ఈ యువ బృందం ఎంతోమందికి ఆదర్శప్రాయం.

## రంగవల్లి



17 చుక్కలు 3 వచ్చే వరకు (సరి చుక్క)



డి పార్వతి, పిఠాపురం, కాకినాడ జిల్లా.



9 చుక్కలు 3 వరుసలు 3 వచ్చే వరకు

ఎం వనజ, అనకాపల్లి, విశాఖపట్నం.



# కుల్దీప్ మాయాజాలం

## రెండో వన్డేలో శ్రీలంకపై 4వికెట్ల తేడాతో టీమిండియా గెలుపు



ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కుల్దీప్

**కోల్‌కత్తా:** ఈడెన్ గార్డెన్స్ వేదికగా శ్రీలంకతో జరిగిన రెండో వన్డేలో భారత్ నాలుగు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంకను భారత బౌలర్లు కట్టడి చేయడంతో 39.4ఓవర్లలో 215పరుగులకే కుప్పకూలింది. స్పిన్నర్ కుల్దీప్(3/51) మిడిలార్డర్ బ్యాటర్స్‌ను ఔట్ చేయగా.. పేసర్లు సిరాజ్(3/30), ఉమ్రన్(2/48) మిగతా పని కానిచ్చారు. అనంతరం టీమిండియా 43.2ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి 219 పరుగులు చేసి గెలిచింది. వికెట్ కీపర్ కేఎల్ రాహుల్(64నాటౌట్)కి తోడు హార్దిక్(36), శ్రేయస్(28) బ్యాటింగ్‌లో రాణించారు. చివర్లో ఈడెన్ గార్డెన్స్ బౌలర్లకు సహకరించడంతో భారత బ్యాటర్స్ ఆచితూచి ఆడారు. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ప్రత్యర్థి లంక బ్యాటర్స్‌ను భారత బౌలర్లు దడపుట్టించారు. కట్టుదిట్టమైన బౌలింగ్‌తో వరుస విరామాల్లో వికెట్లు తీసారు. తొలి వికెట్ 29 పరుగులకే కోల్పోయిన లంక.. 2వ వికెట్‌ను 102 పరుగుల వద్ద కోల్పోయింది. ఆ తర్వాత కుల్దీప్ మాయాజాలం తోడవ్వడంతో 50 పరుగుల వ్యవధిలోనే ఏకంగా 6 వికెట్లు నష్టపోయింది. 152 పరుగుల వద్ద ఏడో వికెట్ కోల్పోయింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కుల్దీప్‌కు లభించగా.. ఈ గెలుపుతో టీమిండియా 2-0తో సిరీస్ గెలుచుకుంది. మూడో, చివరి వన్డే ఆదివారం జరగనుంది.

**న్యూజిలాండ్ టి20 కెప్టెన్‌గా సాంట్నర్**

భారత పర్యటనకు వచ్చే న్యూజిలాండ్ జట్టును ఆ దేశ క్రికెట్ బోర్డు గురువారం ప్రకటించింది. ఈ సిరీస్‌కు విలియమ్సన్ దూరం కాగా.. స్పిన్నర్ సాంట్నర్ కెప్టెన్‌గాఎంపికయ్యాడు. మూడు టి20ల సిరీస్ 27నుంచి ప్రారంభం కానుంది.

## ఢిల్లీ 300/4డిక్లేర్డ్

**న్యూఢిల్లీ:** రంజీట్రోఫీ ఎలైట్ గ్రూప్-బిలో ఆంధ్రప్రదేశ్ జట్టుకు 159పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. ఓవర్ నైట్ స్కోర్ వికెట్ నష్టానికి 19పరుగులతో గురువారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఢిల్లీ జట్టు 4 వికెట్ల నష్టానికి 300పరుగుల వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది. ఇప్పటికే మూడురోజుల ఆట ముగియడంతో ఫలితంపై దృష్టి పెట్టాలన్న ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఢిల్లీ ఓపెనర్ ధృవ్ షోరే(142) సెంచరీకి తోడు షోకెన్(45) బ్యాటింగ్‌లో రాణించారు. హిమ్మత్ సింగ్(45) క్రీజ్‌లో ఉండగా.. మూడోరోజు ఆట ముగియడానికి ముందు ఢిల్లీ కెప్టెన్ యశ్ ధుల్ ఈ నిర్ణయం తీసుకున్నాడు. దీంతో ఆంధ్రప్రదేశ్ జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది.

## క్వార్టర్స్‌కు ప్రణయ్

### మలేషియా ఓపెన్ సూపర్ సిరీస్

**కౌలాలంపూర్:** మలేషియా ఓపెన్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నీ క్వార్టర్‌ఫైనల్లోకి హెచ్‌ఎస్ ప్రణయ్‌రాయ్ దూసుకెళ్లాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రి క్వార్టర్స్‌లో ప్రణయ్ 21-9, 15-21, 21-16తో వార్డోయో(మలేషియా)పై మూడుసెట్ల హోరాహోర పోరులో నెగ్గాడు. క్వార్టర్స్‌లో ప్రణయ్ జపాన్‌కు చెందిన నరొకాతో తలపడనున్నాడు. ఇక పురుషుల డబుల్స్‌లో చిరాగ్‌శెట్టి-సాత్విక్ సాయిరాజ్ జోడీ 21-19, 22-20తో మలేషియా జోడీ మౌలానా-ఫిక్రీలపై గెలిచి క్వార్టర్స్‌కు చేరారు. మహిళల డబుల్స్‌లో త్రీషా జోలీ-గాయత్రీ గోపీచంద్ జోడీ పోరాటం ముగిసింది. తొలిరౌండ్‌లో సంచలన విజయం సాధించి ప్రి క్వార్టర్స్‌కు చేరిన భారత మహిళల జోడీ ప్రి క్వార్టర్స్‌లో 13-21, 21-15, 17-21తో బల్గేరియా జోడీ చేతిలో పోరాడి ఓడారు.


### ప్రపంచ టిటి ఛాంపియన్‌షిప్‌కు

## దియా అర్హత

**దోహా:** 2023 ప్రపంచ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌కు దియా ఛితాలి అర్హత సాధించింది. గురువారం జరిగిన ఆసియా కాంటినెంటల్ స్టేజ్ మ్యాచ్‌లో దియా 11-6, 11-5, 11-7, 11-9తో హాంకాంగ్‌కు చెందిన వింగ్ లామ్‌పై వరుసగేమ్‌లలో గెలిచింది. తొలిరౌండ్‌లో కొరియాకు చెందిన ఛో-హోగో చేతిలో ఓడిన దియా.. తర్వాత మ్యాచ్‌లో గెలిచి ఈ బెర్త్ దక్కించుకుంది. దీంతో 2023, మేలో డర్బన్ వేదికగా జరిగే ప్రపంచ టిటి ఛాంపియన్ షిప్‌కు అర్హత సాధించింది. దీంతో మహిళల సింగిల్స్ విభాగం ప్రీమియర్ ఛాంపియన్‌షిప్‌కు దియా, శ్రీజ ఆకుల, మనిక బత్రా-సాత్విక ఘోష్ నలుగురు అర్హత సాధించారు. పురుషుల సింగిల్స్‌లో హర్మీత్ దేశాయ్ ఓటమిపాలయ్యాడు. సింగపూర్‌కు చెందిన ఇజ్జాక్ చేతిలో 5-11, 11-8, 11-9, 11-8, 1-11, 11-9తో హర్మీత్(భారత్) పోరాడి ఓడాడు.

# హాకీ సంగ్రామం షురూ..!

### భారత్ × స్పెయిన్ మ్యాచ్ రా.7.00గం॥లకు



భారత జట్టు ఆటగాళ్లతో ఒడిషా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్




**భువనేశ్వర్:** ఒడిషాలోని భువనేశ్వర్, రూర్కెలా వేదికలుగా హాకీ ప్రపంచకప్ సంగ్రామం శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. రెండ్రోజుల ముందే ప్రారంభోత్సవ వేడుకలు జరగ్గా.. అర్జెంటీనా - దక్షిణాఫ్రికా జట్ల మధ్య మధ్యాహ్నం జరిగే తొలి మ్యాచ్‌తో 2023 ఎఫ్‌ఐహెచ్ ప్రపంచకప్ టోర్నీ పోటీలు ప్రారంభం కానున్నాయి. టోర్నీలో ఆడే 16జట్లను నాలుగు గ్రూపులుగా విభజించగా.. గ్రూప్-బిలో డిఫెండింగ్ ఛాంపియన్ బెల్జియం జట్టు, టాప్‌సీడ్ ఆస్ట్రేలియా గ్రూప్-ఏలో ఉన్నాయి. ఇక 6వ ర్యాంక్, ఆతిథ్య భారత్ గ్రూప్-డిలో ఉండగా.. తొలి మ్యాచ్‌ను 8వ ర్యాంకర్ స్పెయిన్‌తో చివరి మ్యాచ్‌లో తలపడనుంది. తాజాగా ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించడంతో సెమీస్ బెర్త్ లక్ష్యంగా భారత్ బరిలోకి దిగుతోంది. ప్రతి గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచిన నాలుగుజట్లు నేరుగా క్వార్టర్‌ఫైనల్ బెర్త్‌లు దక్కించుకుంటాయి. ప్రతి గ్రూప్‌లో 2, 3 స్థానాల్లో నిలిచిన జట్లు క్రాస్‌ఓవర్ పోటీల్లో ఆడాల్సి ఉంటుంది. 22, 23న క్రాస్ ఓవర్, 24న క్వార్టర్స్, 27న సెమీఫైనల్స్, 29న ఫైనల్ పోటీలు జరగనున్నాయి.

### ప్రపంచకప్ హాకీ లీగ్ షెడ్యూల్

| | | | |
|---|---|---|---|
| 13(శుక్ర) | అర్జెంటీనా × దక్షిణాఫ్రికా | మ.1.00 | భువనేశ్వర్ |
| | ఆస్ట్రేలియా × ఫ్రాన్స్ | సా.3.00 | భువనేశ్వర్ |
| | ఇంగ్లండ్ × వేల్స్ | సా.5.00 | రూర్కెల |
| | ఇండియా × స్పెయిన్ | రా.7.00 | రూర్కెల |
| 14(శని) | న్యూజిలాండ్ × చిలీ | మ.1.00 | రూర్కెల |
| | నెదర్లాండ్స్ × మలేషియా | సా.3.00 | రూర్కెల |
| | బెల్జియం × కొరియా | సా.5.00 | భువనేశ్వర్ |
| | జర్మనీ × జపాన్ | సా.7.00 | భువనేశ్వర్ |
| 15(ఆది) | స్పెయిన్స్ × వేల్స్ | సా.5.00 | రూర్కెల |
| | ఇండియా × ఇంగ్లండ్ | రా.7.00 | రూర్కెల |
| 16(సోమ) | మలేషియా × చిలీ | మ.1.00 | రూర్కెల |
| | న్యూజిలాండ్ × నెదర్లాండ్స్ | సా.3.00 | రూర్కెల |
| | ఫ్రాన్స్ × దక్షిణాఫ్రికా | సా.5.00 | భువనేశ్వర్ |
| | అర్జెంటీనా × ఆస్ట్రేలియా | సా.7.00 | భువనేశ్వర్ |
| 17(మంగళ) | కొరియా × జపాన్ | సా.5.00 | భువనేశ్వర్ |
| | జర్మనీ × బెల్జియం | రా.7.00 | భువనేశ్వర్ |
| 19(గురు) | మలేషియా × న్యూజిలాండ్ | మ.1.00 | భువనేశ్వర్ |
| | నెదర్లాండ్స్ × చిలీ | సా.3.00 | భువనేశ్వర్ |
| | స్పెయిన్ × ఇంగ్లండ్ | సా.5.00 | భువనేశ్వర్ |
| | ఇండియా × వేల్స్ | సా.7.00 | భువనేశ్వర్ |
| 20(శుక్ర) | ఆస్ట్రేలియా × దక్షిణాఫ్రికా | మ.1.00 | రూర్కెల |
| | ఫ్రాన్స్ × అర్జెంటీనా | సా.3.00 | రూర్కెల |
| | బెల్జియం × జపాన్ | సా.5.00 | రూర్కెల |
| | కొరియా × జర్మనీ | సా.7.00 | రూర్కెల |

# 6,100 పోస్టులకు 5 లక్షలపైనే దరఖాస్తులు

- కానిస్టేబుల్ పోస్టులకు పోటీపడుతున్న 13,961 పోస్టుగ్రాడ్యుయేట్లు
- 22న రాత పరీక్ష

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్రంలో 2,520 సివిల్ కానిస్టేబుల్స్, 3,580 ఎపిఎస్‌పి కానిస్టేబుల్స్ కలిపి మొత్తం 6,100 కానిస్టేబుల్ పోస్టలకు 5,03,486 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 3,95,415 మంది పురుష అభ్యర్థులు కాగా, 1,08,071 మంది మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 22న ఆదివారం ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు జరిగే పరీక్షకు ఈనెల 12 నుంచి 20 వరకూ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. పోలీస్ కానిస్టేబుల్ పోస్టులకు కర్నూలు, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల నుంచి ఎక్కువమంది దరఖాస్తు చేసుకున్నారు. ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చిన దరఖాస్తుల్లో కర్నూలు నుంచి 51,972, శ్రీకాకుళం నుంచి 50,268 మంది, విశాఖపట్నం జిల్లా నుంచి 50,002 మంది ఉన్నారు. విజయనగరం నుంచి 40,321 మంది, తూర్పు గోదావరి నుంచి 42,501 మంది, పశ్చిమగోదావరి నుంచి 27,504 మంది, కృష్ణా నుంచి 34,791మంది, గుంటూరు నుంచి 37,526మంది, ప్రకాశం నుంచి 33,484, నెల్లూరు నుంచి 25,132, కడప నుంచి 41,133మంది, అనంతపురం నుంచి 41,133, చిత్తూరు జిల్లా నుంచి 33,934మంది దరఖాస్తు చేసుకున్నారు. నాన్‌లోకల్ కింద 7,701 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇంటర్మీడియట్ అర్హతతో నిర్వహించే ఈ పోలీస్ రిక్రూట్‌మెంట్‌కు పిహెచ్‌డి పూర్తి చేసుకున్న వారు కూడా దరఖాస్తు చేసుకున్నారు. విద్యార్హతల పరంగా పిహెచ్‌డి చేసిన వారు 10మంది, ఎల్‌ఎల్‌బి నుండి 94మంది, బిసిఎ నుండి 757మంది, ఎంటెక్ నుండి 930మంది దరఖాస్తులను చేసుకున్నారు. ఎంకామ్ నుండి 1,527, 1,845మంది ఎంఎ, 4,134 మంది డిప్లొమా నుండి 15,254, ఎంబిఎనుండి 5,284మంది, ఎమ్మెస్సీ నుండి 4,365మంది, ఇతర డిగ్రీల నుండి 4,134మంది దరఖాస్తు చేసుకున్నారు. బిఎ నుండి 21,024మంది, బి టెక్ నుండి 31,695మంది, బికామ్ నుండి 61,419, బిఎస్‌సి నుండి 61,419 మంది, ఇంటర్మీడియట్ అర్హతతో 2,97,655 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇంటర్ చదువుతున్న వారికి కూడా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించడంతో 16,945మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుదారుల్లో ఎస్‌సిలు 1,31,875 మంది, ఎస్‌టిలు 43,266 మంది, బిసిలు 2,74,567 మంది ఓసిలు 53,778మంది ఉన్నారు. ఈ నెల 22న ఉదయం 10గంటల నుంచి 01గంట వరకు పరీక్షను నిర్వహించనున్నారు. తెలుగు మీడియంలో 3,64,184మంది ఇంగ్లీష్ మీడియంలో 1,39,075 మంది పరీక్ష రాయనున్నారు.

## ఫేసియల్ అటెండన్స్‌పై పునరాలోచించాలి: ఎపి జెఎసి అమరావతి

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ఉద్యోగుల ముఖ ఆధారిత హాజరు విధానంతో క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగులకు తీవ్రసమస్యలను సృష్టిస్తుందని, రాష్ట్రప్రభుత్వం పునరాలోచించాలని ఎపి జెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు. ఎపి జెఎసి అమరావతి ప్రతినిధి బృందం రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. సిఎస్‌ను కలిసిన వారిలో ఎపిజెఎసి అమరావతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవి రావు, నాయకులు ఎస్ మల్లీశ్వరరావు, డి ఈశ్వరరావు, బి కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.




Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68